ఆదర్శం..రాంబాబు సేవలు



క్యారేజీలను పరిశీలిస్తున్న కలెక్టర్ నాగరాణి

వీరవాసరంలో రోజుకు
200 మందికి క్యారేజీలు
సీఎం చంద్రబాబు ప్రవేశపెట్టిన
పీ-4 గుర్తుకు వస్తోంది
అభినందించిన కలెక్టర్ నాగరాణి 6

అన్న క్యాంటీన్‌లో పదార్థాలను వేడిగా, రుచిగా అందించాలి

కలెక్టర్ నాగరాణి

భీమవరం టౌన్, జూలై 23(ఆంధ్రజ్యోతి): అన్న క్యాంటీన్‌లో ఆహార పదార్థాలు శుభ్రంగా, వేడిగా, రుచిగా అందించాలని కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. పట్టణంలోని పాత బస్టాండ్, కొత్త బస్టాండ్ వద్ద అన్న క్యాంటీన్లను బుధవారం ఆమె ఆకస్మికంగా సందర్శించారు. భోజనం చేస్తున్న వారితో మాట్లాడి పదార్థాలు రుచిగా ఉన్నాయా? క్యాంటీన్లు పరిశుభ్రంగా ఉంటున్నాయా? అని ప్రశ్నించారు. ఆహార పదార్థాలను కలెక్టర్ స్వయంగా రుచి చూశారు. అనంతరం 40 మంది పేదలకు చీరలు, దుప్పట్లు, లుంగీలు, టవల్స్ టూత్ పేస్టుల కిట్ పంపిణీ చేశారు. మునిసిపల్ డీఈ రెహమాన్, ఎంహెచ్‌వో సోమశేఖర్, వార్డు సచివాలయం కమ్యూనిటీ కార్యదర్శి మోహన్‌రావు, మహిళా పోలీస్ పుష్పరాణి, తదితరులు ఉన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందించాలి

భీమవరం రూరల్, జూలై 23(ఆంధ్రజ్యోతి):ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యనందించడానికి అధికారులు, ఉపాధ్యాయులు కృషి చేయాలని కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. విద్యా శాఖ అధికారులు, టీచర్స్ యూనియన్ ప్రతినిధులతో కలెక్టరేట్‌లో బుధవారం ఆమె సమీక్షించారు. ఉపాధ్యాయులు ఎప్పటికప్పుడు నైపుణ్యాన్ని పెంచుకుంటూ విద్యా వ్యవస్థను ముందుకు తీసుకెళ్లవలసిన అవసరం ఉందన్నారు. ఆరో తరగతి నుంచి పదో తరగతి వరకు వివిధ సబ్జెక్టులలో వెనుకబడిన విద్యార్థులను విభజించి 'సంసిద్ధత కార్యక్రమం' పేరిట ఉదయం, సాయంత్రం ఒక గంట అదనంగా తరగతులు నిర్వహించాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలలో చేరికలు తక్కువగా ఉన్నాయని, విద్యార్థుల సంఖ్య పెంచడానికి కృషి చేయాలన్నారు. జాతీయ విద్యా విధానంగా భాగంగా నిర్వహించిన 'పరాక్' సర్వేలో పశ్చిమ గోదావరి జిల్లా వెనుకబడి ఉండడంపై సంబంధిత అధికారుల, యూనియన్ నాయకులను కలెక్టర్ ప్రశ్నించారు. డీఈవో నారాయణ, ఏపీసీ శ్యాంసుందర్, ఏడీ సత్యనారాయణ, ఉపాధ్యాయ సంఘాల అధ్యక్షులు పాల్గొన్నారు.

26 నుంచి వృద్ధులకు రేషన్

భీమవరం టౌన్, జూలై 23(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం 60 ఏళ్లు దాటిన వృద్ధులకు, దివ్యాంగులకు ఇంటి వద్ద ముందుగా రేషన్ సరుకులు అందిస్తోంది. ఈనెల 26 నుంచి 30 వరకు డీలర్లు వారి పరిధిలో ఉన్న వృద్ధులు, దివ్యాంగులకు ఆగస్టు నెల రేషన్ సరుకులు అందించనున్నారు. జిల్లాలో దాదాపు 71,603 మంది వృద్ధులు, దివ్యాంగులకు ముందుగానే డీలర్లు రేషన్ సరుకులు అందిస్తారు.



నడిపూడిలో పర్యటిస్తున్న జేసీ రాహుల్ కుమార్

పేదలకు అండగా ఉందాం

- దాతలు ముందుకు రావాలి
- పీ4 సర్వేలో జేసీ పిలుపు

పెనుగొండ, జూలై23(ఆంధ్రజ్యోతి): ప్రజలందరూ సేవాభావం అలవరచుకోవాలని, పేదలకు అండగా ఉందామని జాయింట్ కలెక్టర్ టి.రాహల్ కుమార్ రెడ్డి పిలుపునిచ్చారు. పెనుగొండ మండలం నడిపూడి పంచాయతీ కార్యాలయం వద్ద పీ4 సర్వేలో భాగంగా బంగారు కుటుంబాల గ్రామసభ బుధవారం నిర్వహించారు. జేసీ మాట్లాడుతూ పీ4 బంగారు కుటుంబాలను దత్తత తీసుకోవడానికి దాతలు ముందుకు రావాలన్నారు. గ్రామాల్లో పూర్తిగా పేదరికాన్ని నిర్మూలించవచ్చునన్నారు. గ్రామాల్లో పేదరికం, ఆకలి బాధలు ఉండకూడదనే ఉద్దేశంతో ప్రభుత్వం చక్కటి ఆలోచన చేసి పీ4 కార్యక్రమం రూపొందించిందన్నారు. ముందుగా గ్రామంలో పర్యటించి పలు కుటుంబాల వద్దకు వెళ్లి వివరాలు తెలుసుకున్నారు. వడలిలో రైతు సేవా కేంద్రం వద్ద పలు రికార్డులను ఆయన పరిశీలించారు. తహసీల్దార్ జి.అనిత కుమారి, ఎంపీడీవో టి.సూర్యనారాయణమూర్తి, సర్పంచ్ కడలి బేబీ అన్నపూర్ణ, కార్యదర్శి శ్రీనివాస రెడ్డి, కూటమి నాయకులు పాల్గొన్నారు.

ఇంజనీరింగ్ నుంచి డైరెక్షన్
తొలి ప్రయత్నంలోనే ఉత్తమ దర్శకుడి అవార్డు
షార్ట్ ఫిల్మ్ డైరెక్షన్‌లో
కోపల్లె యువకుడు వంశీ ప్రతిభ 6

తాడేపల్లిగూడెంలో డి.రుషికేశ్ ఒకటో తరగతిలో చేరాడు. విద్యా హక్కు చట్టం (ఆర్‌టీఈ) కింద రుషికేశ్ దరఖాస్తు చేయకున్నా ప్రైవేటు పాఠశాలలో సీటు కేటాయించారు. ఫలితంగా తల్లికి వందనం పథకాన్ని హోల్డ్‌లో పెట్టారు. రుషికేశ్ తల్లి స్వాతి సచివాలయం, మునిసిపల్ అధికారుల వద్దకు తిరిగినా ఫలితం లేదు. దీనిపై అధికారులు స్పష్టత ఇవ్వలేకపోయారు. రుషికేశ్ అన్న తనూష్‌కు మాత్రం తల్లికి వందనం సొమ్ము రూ.13వేలు స్వాతి ఖాతాలో పడింది. ఒకరికంటే ఎక్కువ మంది పిల్లలున్న వారికి ఆర్టీఈ పేరుతో సొమ్ములు పడలేదు.



'తల్లికి వందనం' ప్రైవేటు

ఆర్టీఈ ప్రవేశం పథకానికి అనర్హత!

- కార్పొరేట్ పాఠశాలలకు పేద విద్యార్థులు ఎంపిక
- చేర్చుకోడానికి యాజమాన్యాలు వెనుకంజ
- మరి కొందరు విద్యార్థుల నిరాసక్తత
- అయినప్పటికీ ఆర్టీఈ జాబితాలో విద్యార్థులు
- తల్లుల ఖాతాలో జమ కాని వందనం సొమ్ము
- స్పష్టత ఇవ్వలేకపోతున్న అధికారులు

(భీమవరం-ఆంధ్రజ్యోతి)

జిల్లాలో 1261 మంది పేద విద్యార్థులకు ఆర్టీఈలో ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలల్లో సీట్లు కేటాయించారు. సీట్లు మంజూరైనా చేర్చుకోవడానికి కొన్ని పాఠశాలలు నిరాకరిస్తున్నాయి. ప్రభుత్వం ట్యూషన్ ఫీజు తక్కువగా చెల్లిస్తుందన్న ఉద్దేశంతో యాజమాన్యాలు ఏదొక కారణం చూపుతూ విద్యార్థులను చేర్చుకోవడం లేదు. కిలో మీటరు పరిధిలో లేరంటూ తాడేపల్లిగూడెంలో ఒక ప్రైవేటు పాఠశాల ఆర్టీఈలో సీటు లభించిన విద్యార్థిని చేర్చుకోవడానికి నిరాకరించింది. భీమవరంలో ఫీజులు అధికం కావడంతో కార్పొరేట్ పాఠశాలలు ససేమిరా అంటున్నాయి. అక్కడ సీటు లభించినాసరే విద్యార్థులు చేరడానికి ఆసక్తి చూపడం లేదు. పుస్తకాలు, అడ్మిషన్ ఫీజులు అధికంగా ఉండడంతో విద్యార్థులు ఆర్టీఈలో సీటు లభించినా చేరడం లేదు. విద్యార్థి చేరినా చేరకున్నా ఆర్టీఈలో పేరు ఉండడంతో తల్లికి వందనం సొమ్ము అందడం లేదు.

ఆర్టీఈతోనే తంటా

ఒకటో తరగతిలో చేరిన విద్యార్థులకు కూడా రెండో విడతలో సొమ్ములు జమ అయ్యాయి. ఆర్టీఈ జాబితాలో అత్యధిక మంది విద్యార్థులున్నారు. ప్రభుత్వం కేటాయించిన సీట్లకంటే జిల్లాలో ఎక్కువగానే ఆర్టీఈ జాబితాలో ఉన్నట్టు పిల్లల తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. వారికి ఎలా న్యాయం చేయాలనే దానిపై విద్యాశాఖ అధికారులు, సచివాలయ ఉద్యోగుల్లో స్పష్టత కొరవడింది. ఆర్టీఈలో ఉన్న వారికి తల్లికి వందనం పడితే రూ.8,500 పాఠశాల యాజమాన్యాలకు చెల్లించాలి. లేదంటే ప్రభుత్వమే పాఠశాలలకు రూ.8,500 మినహాయించి మిగిలిన సొమ్ము జమ చేస్తుంది. ప్రభుత్వం ఎటువంటి నిర్ణయం తీసుకుంటుందనేది జిల్లా అధికారులకు స్పష్టత రాలేదు. ప్రస్తుతం ఆర్టీఈపై తల్లిదండ్రుల్లో చర్చ సాగుతోంది.

రెండో విడత సొమ్ము జమ

తల్లికి వందనం పథకంలో తల్లుల ఖాతాలో రెండో విడత సొమ్ములు జమ అయ్యాయి. జిల్లాలో తొలి విడత 1,76,574 మందికి రూ.13వేలు వంతున తల్లుల ఖాతాలో సొమ్ము జమ కాగా 41,703 మంది గతంలో అనర్హుల జాబితాలో ఉన్నారు. విద్యుత్ బిల్లు, సొంత స్థలాలు, ప్రభుత్వ ఉద్యోగులు, ఆదాయ పన్ను చెల్లింపుదారులు, తదితర కారణాలతో 41,703 మందికి అనర్హుల జాబితాలో ఉంచారు. జిల్లాలో 20,139 మంది అభ్యంతరాలు నమోదు చేయడంతో 11,416 మంది విద్యార్థులకు రెండో విడతలో సొమ్ములు జమ చేశారు. మరో 4,262 అభ్యంతరాలు పరిశీలనలో ఉండగా వాటి నుంచి అత్యధికంగా అర్హుల జాబితాలో చేరనున్నాయి. వారికి కూడా రూ.13 వేల వంతున ప్రభుత్వం జమ చేయనుంది. నాలుగు చక్రాల వాహనాలు, భూములు, ఆదాయపు పన్ను, ప్రభుత్వ ఉద్యోగుల జాబితాలోకి 1,558 మంది విద్యార్థులు చేరారు. వారికి తల్లికి వందనం సొమ్ములు జమయ్యే అవకాశం లేదు. విద్యుత్ బిల్లు అధికంగా ఉన్న కుటుంబాలకు సంబంధించి మరో 2,036 మంది విద్యార్థులకు కూడా రెండో విడతలో తల్లికి వందనం వర్తించలేదు. మరో 290 మంది విద్యార్థులకు అర్హత ఉన్నా వారి డేటా వెబ్‌సైట్‌లో కానరావడం లేదు. అనర్హులుగా గతంలో ప్రకటించిన విద్యార్థుల నుంచి మళ్లీ అభ్యంతరాలను స్వీకరించి ఇలా రెండో విడతలో అత్యధిక మంది విద్యార్థులకు తల్లికి వందనం సొమ్ము జమ చేశారు.



ధవళేశ్వరం కాటన్ బ్యారేజ్ నుంచి దిగువకు ప్రవహిస్తున్న వరద నీరు

గోదావరి పెరుగుతోంది

ధవళేశ్వరం, జూలై 23 (ఆంధ్రజ్యోతి): వర్షాలతో వాగులు, వంకలు పొంగి గోదావరిలో చేరుతున్నాయి. నీటి మట్టం క్రమేపీ పెరగడంతో కాటన్ బ్యారేజ్ మొత్తం 175 గేట్లను అర మీటరు పైకి ఎత్తి 2,38,886 క్యూసెక్కులను సముద్రంలోకి విడుదల చేస్తున్నారు. ధవళేశ్వరం వద్ద 10.90 అడుగుల నీటిమట్టం నమోదైంది. భద్రాచలం వద్ద గోదావరి నీటిమట్టం పెరుగుతూ బుధవారం సాయంత్రానికి 20 అడుగులకు చేరింది.

శాకంబరిగా మహాలక్ష్మమ్మ



పెంటపాడు మండలం పడమర విప్పర్రులో మహాలక్ష్మమ్మ అమ్మవారు బుధవారం శాకంబరి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. - పెంటపాడు

బాలికపై అత్యాచార యత్నం.. యువకుడిపై పోక్సో కేసు | బావను హతమార్చిన బావమరిదికి జీవితఖైదు | ఆస్తి అమ్మనివ్వడం లేదని.. దంపతుల మధ్య గొడవ.. వేర్వేరు చోట్ల భార్యలను హతమార్చిన భర్తలు 7

అమృత్ 2.0

నిధులు కేటాయింపు రూ.కోట్లలో

ఆకివీడు	76.34
నరసాపురం	125.92
భీమవరం	167.72
పాలకొల్లు	119.26
తణుకు	118.11
తాడేపల్లిగూడెం	28.43

- విజ్జేశ్వరం నుంచి గోదావరి నీరు మళ్లింపు
- పైప్‌లైన్ ప్రాజెక్ట్ టెండర్ గడువు పెంపు
- ఏజన్సీలతో సంప్రదిస్తున్న ప్రభుత్వం

(భీమవరం-ఆంధ్రజ్యోతి)

విజ్జేశ్వరం నుంచి గోదావరి నీటిని పట్టణాలకు మళ్లించేందుకు అమృత్-2.0లో పైప్‌లైన్ ప్రాజెక్ట్ ఖరారైంది. పనులు చేపట్టడానికి టెండర్లు ఆహ్వానించారు. అయితే పెద్ద సంస్థలు వెనుకంజ వేయడంతో ప్రభుత్వం ఏజన్సీలను సంప్రదిస్తోంది. మరోవైపు నిబంధనలను కాస్త సడలించినట్టు సమాచారం. తద్వారా ఏజన్సీల నుంచి స్పందన వస్తుందని ఆశిస్తున్నారు.

జిల్లాలో భీమవరం, తణుకు, పాలకొల్లు, నరసాపురం, ఆకివీడు పట్టణాలకు విజ్జేశ్వరం నుంచి పైప్‌లైన్ ద్వారా పంపుల చెరువులకు నీటిని మళ్లిస్తారు. చెరువుల వద్ద శుద్ధి చేసి పట్టణ ప్రజలకు మంచినీటిని సరఫరా చేస్తారు. కాలువల్లో కాలుష్య జలాలను నివారించేందుకు నేరుగా విజ్జేశ్వరం నుంచి పైప్‌లైన్‌తో సరఫరా చేయాలని ప్రభుత్వ ప్రణాళిక. రెండు పూటలా సమృద్ధిగా మంచినీరు అందించడానికి చర్యలు తీసుకుంది. భీమవరం, తాడేపల్లిగూడెంలోని రెండు ప్రాంతాల్లో 24 గంటలు మంచినీరు అందించేలా అమృత్ 2.0లో చర్యలు తీసుకున్నారు. ఈ నెల 21న టెండర్‌లు తెరవాల్సి ఉంది. ఏజన్సీల నుంచి పోటీ ఉండాలన్న ఉద్దేశంతో నిబంధనల్లో వెసులుబాటు కల్పించి ఈ నెల 31 వరకు గడువు పెంచారు. మరోవైపు ప్రభుత్వం కూడా ఏజన్సీలతో చర్చలు జరుపుతోంది.

తాడేపల్లిగూడెంలో శుద్ధి ప్లాంట్ పెండింగ్

మంచినీటి కోసం రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోంది. తాడేపల్లిగూడెంలో మంచినీటి సమస్యను అధిగమించేందుకు కొత్తగా పంపుల చెరువు వద్ద ట్రీట్‌మెంట్ ప్లాంట్ నిర్మిస్తున్నారు. వైసీపీ ప్రభుత్వంలో బిల్లులు చెల్లించకపోవడంతో కాంట్రాక్టర్ చేతులెత్తేశాడు. దాదాపు రూ. 3.00 కోట్ల మేర బిల్లులు చెల్లించాలి. బకాయిలు చెల్లిస్తే శుద్ధి ప్లాంట్ సిద్ధమవుతోంది. పట్టణ ప్రజలకు సమృద్ధిగా మంచినీరు అందించడానికి వీలు పడుతుంది. ఎపినిట్‌కు ప్రదిరోజు 10 లక్షల లీటర్ల మంచినీటిని సరఫరా చేయాలి. కొత్త ప్లాంట్ అందుబాటులోకి వస్తేనే అది సాధ్య పడుతుంది. ప్రభుత్వం బిల్లులు మంజూరు చేస్తుందని అంతా ఎదురుచూస్తున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత బకాయిలను ఒక్కొక్కటిగా విడుదల చేస్తోంది. ఫలితంగా కాంట్రాక్టర్లనుంచి స్పందన ఉంది. అమృత్ 2.0లో పెద్ద మొత్తంలో నిధులు కేటాయించడంతో ఏజన్సీలు తర్జనభర్జన నేపథ్యంలో ప్రభుత్వం చర్చలు జరుపుతోంది.

నరసాపురంలో ఉద్యోగ మేళా

- 19 కంపెనీల ప్రతినిధుల ఇంటర్వ్యూ
- 450 మంది అభ్యర్థులు హాజరు
- 148 మంది ఉద్యోగాలకు ఎంపిక

నరసాపురం, జూలై 23(ఆంధ్రజ్యోతి): యువతకు ఉద్యోగావకాశాలు కల్పించడంపై ప్రభుత్వం దృష్టి సారించింది. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ఉపాధి అవకాశాలు లేక నిరుద్యోగులు ఇతర రాష్ట్రాలకు వలస వెళ్లారు. కూటమి ప్రభుత్వం వివిధ ప్రైవేటు కంపెనీలతో మాట్లాడి ప్రతి నియోజకవర్గంలో ఉద్యోగ మేళా నిర్వహిస్తోంది. నరసాపురం వైఎన్ కళాశాల హెచ్‌ఆర్డీ, ఏపీ స్కిల్స్ డవలప్‌మెంట్ సంయుక్తంగా బుధవారం నిర్వహించిన జాబ్‌మేళాకు విశేష స్పందన లభించింది. వివిధ ప్రాంతాల నుంచి 450 మంది యువత హాజరయ్యారు. 19 కంపెనీల ప్రతినిధులు ఇంటర్వ్యూ చేసి 148 మందిని ఉద్యోగాలకు ఎంపిక చేశారు. టెక్ మహేంద్ర, పంజాబ్ నేషనల్ బ్యాంకు లైఫ్, మెట్, యాక్సిస్ బ్యాంకు, హెటిరో ఫార్మా, ఏయూ స్మాల్ బ్యాంకు, అపోలో ఫార్మసీ, డైకిల్, ముత్తూట్ ఫైనాన్స్, బీటీఎస్ గ్రూప్, కత్తర్‌కు చెందిన వెల్డర్స్ కంపెనీ, కువైట్‌కు చెందిన నిర్మాణ సంస్థ కంపెనీలు నియామకాలు చేపట్టాయి.

యువతకు ఉపాధి కల్పించడమే లక్ష్యం

యువతకు ఉపాధి కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని ఆర్డీవో దాసి రాజు అన్నారు. జాబ్ మేళ్లా ప్రారంభించిన ఆర్డీవో మాట్లాడుతూ ప్రతి నియోజకవర్గంలో నిర్వహిస్తున్న మేళా యువత సద్వినియోగం చేసుకోవాలన్నారు. పోటీ ప్రపంచంలో ఉపాధి దొరకడం కష్టంగా మారిందన్నారు. ముందు ఏదో ఒక జాబ్‌లో చేరి ఆ అనుభవంతో మంచి కంపెనీల్లో వెళ్లేందుకు నిరుద్యోగులు ప్రయత్నించాలన్నారు.



ఉద్యోగ మేళాకు హాజరైన యువత

కళాశాల కరస్పాండెంట్ అందే రామసతీష్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో స్కిల్ డవలప్‌మెంట్ జిల్లా మేనేజర్ లోక్‌మాన్ మాట్లాడుతూ జాబ్‌మేళా ద్వారా ఎంతో మందికి ఉపాధి కల్పిస్తున్నామన్నారు. యువతకు వివిధ అంశాలపై కూడా ఏపీ స్కిల్ డవలప్‌మెంట్ ఆధ్వర్యంలో శిక్షణ ఇస్తున్నామన్నారు. తమ వెబ్‌సైట్‌లో చూసుకుని యువత దరఖాస్తు చేసుకుంటే అవకాశం ఇస్తామన్నారు. కార్యక్రమంలో కోఆర్డినేటర్ కిశోర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పథకాలన్నీ అందుతున్నాయా..?

చింతలపూడిలో హోం మంత్రి అనిత ఆరా..

జగన్ మామ సున్నం రాశాడు..!

పెదపాడులో బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత



చింతలపూడిలో ప్రభుత్వ పథకాలు వివరిస్తున్న హోం మంత్రి అనిత

ఏలూరు జిల్లా చింతలపూడి, దెందులూరు నియోజకవర్గాలో హోం మంత్రి అనిత, బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత బుధవారం పర్యటించారు. ఇంటింటికి తిరిగి ప్రభుత్వ పథకాలు అందుతున్నాయా అని హోంమంత్రి వనిత ఆరా తీశారు. గత ప్రభుత్వంలో మేనమామనంటూ జగన్ విద్యార్థులకు సున్నం రాశాడని మంత్రి సవిత ఎద్దేవా చేశారు.

ఇంటింటికీ వెళ్లిన మంత్రులు

చింతలపూడి/పెదపాడు జూలై 23(ఆంధ్రజ్యోతి): అందరికీ ప్రభుత్వ పథకాలు అందున్నాయా అంటూ హోం మంత్రి అనిత ఇంటింటికీ వెళ్లి ప్రజలను ఆరా తీశారు. లింగపాలెం, చింతలపూడి మండలాల్లో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో బుధవారం ఆమె పాల్గొన్నారు. ఎమ్మెల్యే సొంగా రోషన్‌కుమార్, నాయకులు, కార్యకర్తలతో ప్రజలను కలిశారు. నియోజకవర్గ పరిశీలకుడు కోళ్ల నాగేశ్వరరావు, పార్టీ జిల్లా అధ్యక్షుడు గన్ని, కూటమి నాయకులు, కార్యకర్తలు తదితరులు మాట్లాడారు.

- దెందులూరు నియోజకవర్గం పెదపాడు మండలం అప్పనవీడులో మంత్రి ఎస్.సవిత మాట్లాడారు. గతంలో మేనమామనంటూ జగన్ సున్నం రాశాడని, కూటమి ప్రభుత్వం కుటుంబంలో ఎంతమంది పిల్లలున్నా తల్లికి వందనం సొమ్ము ఇచ్చిందన్నారు. ఎమ్మెల్యే చింత మనేని ప్రభాకర్, నాయకులు పాల్గొన్నారు.

స్మార్ట్ మీటర్ల ఏర్పాటుపై అపోహలు వద్దు

- అదనపు చార్జీలు ఉండవు
- వినియోగదారుల చేతుల్లోనే వినియోగం, బిల్లు నియంత్రణ



రఘునాథబాబు
ఏపీఈపీడీసీఎల్ ఎస్ఈ

భీమవరం టౌన్, జూలై 23(ఆంధ్రజ్యోతి): విద్యుత్ స్మార్ట్ మీటర్ల ఏర్పాటుపై ఎటువంటి అపోహలు వద్దని, వీటి వల్ల వినియోగదారులపై ఎలాంటి అదనపు చార్జీల భారం ఉండదని ఏపీఈపీడీసీఎల్ ఎస్ఈ ఎ.రఘునాథబాబు తెలిపారు. స్మార్ట్ మీటర్ల ఏర్పాటు ప్రక్రియ వివరాలను బుధవారం ఆయన తెలిపారు. విద్యుత్ వినియోగదారుల సేవలలో పారదర్శకత మరింత పెంచేందుకు కేంద్ర ప్రభుత్వం ఆర్‌డీఎస్ఎస్ పథకంలో స్మార్ట్ మీటర్ల ఏర్పాటు చేస్తుందన్నారు. ఏపీఈఆర్సీ రెగ్యులేషన్ 2021 ప్రకారం ప్రభుత్వ, వాణిజ్య కేటగిరీ సర్వీసులకు వీటిని బిగిస్తున్నామని చెప్పారు. వీటితోపాటు ఎక్కువ విద్యుత్ వినియోగం కలిగిన (హై వేల్యూ) గృహ వినియోగదారులకు కూడా అమర్చుతున్నామని తెలిపారు. స్మార్ట్ మీటర్లను అమర్చే ముందు వాటి ప్రత్యేకతలు, ప్రయోజనాలపై విద్యుత్ సిబ్బంది వినియోగదారులకు అవగాహన కల్పిస్తున్నారన్నారు.

చార్జీలు చెల్లించనవసరం లేదు

స్మార్ట్ మీటర్ ఏర్పాటు సమయంలో వినియోగదారులు వాటి ఖరీదు, చార్జీలు చెల్లించవలసిన అవసరం లేదని రఘునాథబాబు తెలిపారు. స్మార్ట్ మీటర్ల ఏర్పాటువల్ల వినియోగదారులపై విపరీత భారాలు పడతాయనే ఆందోళన అవసరం లేదన్నారు. స్మార్ట్ మీటర్లు ఎక్కువ విద్యుత్ వినియోగాన్ని నమోదు చేయవని, బిల్లులు పెరిగే ప్రసక్తే లేదన్నారు.

మరింత పారదర్శకత

స్మార్ట్ మీటర్ల ద్వారా మరింత పారదర్శకత ఉంటుందని రఘునాథబాబు తెలిపారు. ప్రస్తుత విద్యుత్ వినియోగాన్ని పర్యవేక్షించడానికి, వినియోగాన్ని సరిపోల్చుకోడానికి స్మార్ట్ మీటర్లు సహకరిస్తాయన్నారు. వినియోగాన్ని ఎప్పటికప్పుడు తెలుసుకోవచ్చని, అధిక వినియోగాన్ని నియంత్రించుకునే అవకాశం ఉందన్నారు. పవర్ ట్రిప్ అయితే వెంటనే సరఫరా త్వరితగతిన పునరుద్ధరించేందుకు వీలు కలుగుతుందన్నారు.

టారిఫ్ ప్రకారమే విద్యుత్ బిల్లులు

రాష్ట్ర విద్యుత్ నియంత్రణ మండలి (ఏపీఈఆర్సీ) నిర్ణయించిన టారిఫ్ ప్రకారమే విద్యుత్ బిల్లులు వసూలు చేస్తామని ఎస్ఈ తెలిపారు. బిల్లు వివరాలను వినియోగదారుని మొబైల్‌కు చేరవేస్తామని చెప్పారు. ఈ-బిల్‌లో వినియోగించిన యూనిట్లు, చెల్లించవలసిన చార్జీల వివరాలు తెలియజేస్తామన్నారు.

టోల్ ఫ్రీ నంబర్ 1912

స్మార్ట్ మీటర్ ఏర్పాటుకు సంబంధించిన సందేహాల నివృత్తికోసం వినియోగదారులు టోల్ ఫ్రీ నెంబర్ 1912కు సంప్రదించవచ్చునని తెలిపారు.

డేంజర్

రక్షణ లేని విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు

ఏలూరు నగరంలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు రక్షణ ప్రదేశాల్లో కాకుండా రోడ్డు మార్జిన్‌లలో, సందుల్లో ఏర్పాటు చేయడం వల్ల ప్రజలు ప్రమాదకరంగా రాకపోకలు సాగించాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి. రామచంద్రరావుపేటలోని జీవీ మాల్ సమీపంలో డ్రెయిన్‌పైనే విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయడం, వన్‌టౌన్‌లోని మార్వాడీ గుడి వెనుకవైపు గల సందులో రోడ్డు మార్జిన్‌లోనే ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయడంతో ప్రమాదం నెలకొంది. సీపీఎం ఆఫీసు రోడ్డులో మేయర్ క్యాంపు కార్యాలయం సమీపంలో రోడ్డు మార్జిన్‌లో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్, మస్తాన్ మన్యం కాలనీలోని పాఠశాల సమీపంలో రోడ్డు మార్జిన్‌లో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేయడం ఆయా ప్రాంతాల్లోని ప్రజలకు రాకపోకలు సాగించేందుకు భయాందోళనలు వ్యక్తం చేస్తున్నారు. వీటికి ఎటువంటి రక్షణ గోడలు లేకపోవడం, చిన్న పిల్లలకు సైతం అందే విధంగా విద్యుత్ వైర్లు కిందకు ఉండడం, సమీపంలోనే పాఠశాలలు ఉండడం ప్రమాదకరంగా నెలకొన్నాయి. భీమవరం పట్టణంలో పలు ప్రాంతాల్లో ప్రమాదకరంగా ట్రాన్స్‌ఫార్మర్లు ఉన్నాయి.

- ఏలూరు కార్పొరేషన్ (ఆంధ్రజ్యోతి)



భీమవరం తాడేరు రోడ్డులో ఎటువంటి రక్షణ లేని ట్రాన్స్‌ఫార్మర్



ఇందిరమ్మ కాలనీ వద్ద పెట్రోల్ బంక్ ఎదురుగా ట్రాన్స్‌ఫార్మర్‌ను చుట్టేసిన తీగలు



కలెక్టరేట్‌కు వెళ్లే దారిలో..



విస్సాకోడేరు రోడ్డులో ట్రాన్స్‌ఫార్మర్‌పైకి పాకిన తీగలు



ఉండి-ఆకివీడులో రోడ్డులో చెరుకువాడ వద్ద హెచ్‌టీ లైన్‌కు సంబంధించిన స్తంభానికి అల్లుకున్న తీగలు

- ఫొటోగ్రాఫర్, భీమవరం



ఆర్ఆర్ పేటలో డ్రెయిన్‌పై నీళ్లతొట్టె.. పక్కనే ట్రాన్స్‌ఫార్మర్లు..



ఏలూరు సీపీఎం రోడ్డులో రోడ్డు మార్జిన్‌లోనే ట్రాన్స్‌ఫార్మర్



మార్వాడీ గుడి వెనుకవైపు సందులో ట్రాన్స్‌ఫార్మర్



మస్తాన్ మన్యం కాలనీ సమీపంలో రోడ్డు మార్జిన్‌లోనే ట్రాన్స్‌ఫార్మర్



రామచంద్రరావుపేటలోని జీవీ మాల్ సమీపంలోని డ్రెయిన్‌పై విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్



బలుసులమ్మకు ఆషాఢం సారె

తాడేపల్లిగూడెం, జూలై 23(ఆంధ్రజ్యోతి) : పట్టణ ఇలవేలుపు బలుసులమ్మకు ఆషాఢం బుధవారం ఆషాఢం సారె అందించారు. ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ దంపతులు పాల్గొన్నారు. రకరకాల పిండివంటలను తెచ్చి అమ్మవారికి సమర్పించారు. ఆలయానికి కోలాట బృందం భజనలు చేస్తుంటే, డప్పు వాయిద్యాల నడుమ భక్తులు పెద్ద ఊరేగింపుగా చేరుకున్నారు. ఎమ్మెల్యే దంపతులు పట్టువస్త్రాలు ధరించి వేడుకగా అమ్మవారి ఆలయంలో భక్తులతో కలిసి అమ్మవారిని దర్శనం చేసుకున్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గంలోని ప్రజలందరిపైనా అమ్మవారి ఆశీస్సులు ఉండాలని కోరారు. రానున్న రోజుల్లో నిర్వహించే జాతర రాష్ట్రంలో మరెక్కడా జరగని విధంగా నిర్వహించాలని నిర్వాహకులకు, పట్టణ ప్రజలకు ఆయన సూచించారు.ఎమ్మెల్యే తనయుడు బొలిశెట్టి రాజేష్, ఆలయ నిర్వాహకులు శ్రీరంగా అంజి, సభ్యులు పాల్గొన్నారు.



వ్యవసాయం

ఉపాయం ఉంటే ఎంతటి పెద్ద పనైనా సులువుగా చేసేయొచ్చు.. ఇక్కడ ఈ రైతులు తమ ఐడియాతో ఈజీగా పెద్ద పైప్‌ను ఇలా తమ పొలానికి చేర్చారు..నిజానికి దీన్ని తీసుకు వెళ్లాలంటే పెద్ద వాహనం అవసరం అవుతుంది..కానీ వీళ్లు ఒకరికి ఒకరు ఇలా సాయం చేసుకుంటూ తమ పని సులువు చేసుకున్నారు. మొగల్తూరు మండలం పేరుపాలెం వద్ద కనిపించిన దృశ్యం.. - ఫొటోగ్రాఫర్, భీమవరం(ఆంధ్రజ్యోతి)

ఇంజనీరింగ్ నుంచి డైరెక్షన్ వైపు

తొలి ప్రయత్నంలోనే ఉత్తమ దర్శకుడిగా అవార్డు

షార్ట్ ఫిల్మ్ డైరెక్షన్‌లో కోపల్లె యువకుడు వంశీ ప్రతిభ

కాళ్ల, జూలై 23 (ఆంధ్రజ్యోతి) : ఒకవైపు విద్యలో రాణిస్తూ.. మరొకవైపు తాను అనుకున్న ఆశయ సాధనకు అడుగులు వేస్తూ తొలి ప్రయత్నంలోనే విజయం సాధించాడు.. కాళ్ల మండలం కోపల్లె గ్రామానికి చెందిన ఇందుకూరి రవివర్మ- విజయలక్ష్మి దంపతుల కుమారుడు వంశీకృష్ణంరాజు హైదరాబాద్ గీతమ్స్ ఇంజనీరింగ్ కళాశాలలో మూడో సంవత్సరం బీటెక్ కంప్యూటర్ సైన్స్ విద్య నభ్యసిస్తున్నాడు. చిన్ననాటి నుంచి చదువుతో పాటు సినిమాలపై ఆసక్తి ఉన్న వంశీ విభిన్నమైన రీతిలో ప్రేక్షకులకు మంచి సినిమాను చూపించాలనే ఆలోచనతో సొంతంగా ఒక కథ రాసుకున్నాడు. దీనికి తల్లిదండ్రుల ప్రోత్సాహం తోడవ్వడంతో కథకి కార్యరూపం ఇచ్చి షార్ట్‌ఫిల్మ్ చిత్రీకరించాడు. సుమారు సంవత్సరంపాటు అనేక అడ్డంకులను అధిగమించి ఈ ఏడాది మే నెలలో 'పర్వసం' లఘు చిత్రాన్ని పూర్తి చేశాడు. తర్వాత ఈ సినిమాను ఎలా ప్రజెంట్ చేయాలనే ఆలోచన వచ్చిన సమయంలో పరిచయం చేయడానికి ఉత్తమమైన వేదిక 'ఫిల్మ్ ఫెస్టివల్'గా భావించాడు. దాంతో ఫెస్టివల్స్ కోసం శోధించడం ప్రారంభించి ఈనెల 20వ తేదీన కోల్‌కతాలో జరిగిన 14వ అంతర్జాతీయ షార్ట్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో ప్రదర్శించాడు. ప్రపంచ వ్యాప్తంగా సుమారు వెయ్యి మంది రష్యన్, ఇజ్రాయిల్, ఉక్రెయిన్, ఇంగ్లీష్, హిందీ తదితర భాషల్లో చిత్రాలను ప్రదర్శించగా 300 షార్ట్ ఫిల్మ్‌లు ఎంపిక చేశారు. వాటిలో 60 సినిమాలకు విభిన్న కేటగిరీల్లో అవార్డులు లభించాయి. ఈ క్రమంలో పెళ్లయిన ఏడాది తర్వాత ఒక వివాహిత జంట మధ్య సాగిన భావోద్వేగాలు, సంఘర్షణల కథ నేపథ్యంలో 'పర్వసం' టైటిల్‌తో తీసిన 50 నిమిషాల నిడివి గల తెలుగు షార్ట్ ఫిల్మ్‌కి ఉత్తమ దర్శకుడు- జ్యూరీ అవార్డును నిర్వాహకులు రాంభూల్ సింగ్, ప్రముఖ బెంగాల్ దర్శకుడు సుదీప్ రంజన్ సర్కార్ చేతుల మీదుగా వంశీ అందుకున్నాడు. ఈ లఘుచిత్రాన్ని 70 శాతం హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో, మిగిలిన 30 శాతం విశాఖపట్నం బీచ్‌లో తీసినట్లు తెలిపాడు.



విశాఖ బీచ్ వద్ద షూటింగ్ చేస్తూ..



తల్లిదండ్రులతో వంశీకృష్ణంరాజు

అవార్డు అందుకోవడం ఆనందంగా ఉంది : వంశీ కృష్ణంరాజు

తొలి చిత్రంలోనే ఉత్తమ దర్శకుడిగా ప్రముఖ బెంగాల్ డైరెక్టర్ సుదీప్ రంజన్ సర్కార్ చేతుల మీదుగా అందుకోవడం ఆనందంగా ఉంది. నా ఆసక్తిని గుర్తించి వెన్నంటి ప్రోత్సహించిన తల్లిదండ్రులకు కృతజ్ఞతలు తెలుపుతూ, భవిష్యత్‌లో మంచి అర్థవంతమైన చిత్రాలు రూపొందించి, విభిన్నమైన కథలతో ప్రేక్షకుల మనస్సును తాకే విధంగా ఒక మంచి సినిమా తీయాలని మంచి దర్శకుడిగా సినిమా పరిశ్రమలో చోటు దక్కించుకోవాలన్నదే నా ఆశయం.

ఆదర్శం..రాంబాబు సేవలు

రోజుకు రెండు వందల మందికి క్యారేజీలు ఇవ్వడం మాటలు కాదు

సీఎం చంద్రబాబు ప్రవేశపెట్టిన పి-4 గుర్తుకు వస్తోంది..

అభినందించిన కలెక్టర్ నాగరాణి



భోజనం రుచి చూస్తున్న పశ్చిమ గోదావరి జిల్లా కలెక్టర్ నాగరాణి

భీమవరం టౌన్, జూలై 23 (ఆంధ్రజ్యోతి) : నేటి తరానికి ఆదర్శంగా నిలుస్తున్న తులసీ రాంబాబు సేవలు ముఖ్యమంత్రి చంద్రబాబు చేపట్టిన పి-4 గుర్తు చేస్తున్నాయి, సంపాదించిన దానిలో మానవ సేవకు ఖర్చు చేయడం ఎంతో గొప్ప విషయమని, గడిచిన ఐదు సంవత్సరాలుగా వృద్ధులకు, అచేతన స్థితిలో ఉన్న వారికి ప్రతినిత్యం ఆహారాన్ని అందించాలంటే ఎంతో దాతృత్వం కలిగి ఉండాలని పశ్చిమగోదావరి జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. వీరవాసరంలో తులసీ రాంబాబు చేస్తున్న అన్నదాన సేవలను కలెక్టర్ బుధవారం స్వయంగా పరిశీలించి వారి కుటుంబాన్ని అభినందించారు. ఆహార పదార్థాలను జిల్లా కలెక్టర్ స్వయంగా రుచి చూశారు. ఐదు సంవత్సరాలుగా ప్రతి రోజూ వీరవాసరం మండలంలోని 18 గ్రామాలలో సుమారు 200 మంది వృద్ధులకు, అచేతన స్థితిలో వుండి ఆహార పదార్థాలను వండుకోలేని పరిస్థితిలో ఉన్నవారికి రెండు పూటలకు సరిపడా క్యారేజీల ద్వారా ఆహారం అందజేస్తున్నట్లు రాంబాబు కలెక్టర్‌కు తెలిపారు. ప్రతి బుధవారం, ఆదివారం కాయగూరలతో పాటు, మాంసాహారం కూడా అందజేస్తున్నామన్నారు. వంటలు తయారు చేయడం, క్యారేజీలు కట్టడం, ఆటోలో తీసుకెళ్లి అందజేయడం మొత్తం ఈ పనులన్నింటికి ఐదుగురు సిబ్బంది నియమించినట్లు తెలిపారు. 200 మందికి భోజనాలు తయారు చేసి అందజేయడానికి సుమారు రోజుకు రూ. 8 వేల నుంచి 10 వేల వరకు ఖర్చవుతుందని, సంవత్సరానికి సుమారు రూ.30 లక్షల నుంచి రూ.35 లక్షల మధ్య ఖర్చు అవుతుందని, ఎవరి వద్ద విరాళాలు సేకరించకుండానే ఈ కార్యక్రమాన్ని ఐదు సంవత్సరాలుగా భగవంతుని దయతో నిరంతరాయంగా కొనసాగిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి పిలుపు మేరకు దాతృత్వం కలిగిన వ్యక్తులు మార్గదర్శకులుగా నమోదుకు ముందుకు రావాలని జిల్లా కలెక్టర్ ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. వీరవాసరం తహసీల్దార్ రామాంజనేయులు, ఎంపీపీ వీరవల్లి దుర్గా భవాని, రాంబాబు సతీమణి వరలక్ష్మి, కుమార్తె గోవర్ధిని, తండ్రి శ్రీరామమూర్తి తదితరులు ఉన్నారు.

విద్యుత్ కోతలు..జనం వెతలు

ఆదాయం కోల్పోతున్న చిరు వ్యాపారులు

విద్యుత్ హెచ్చు తగ్గులతో ఇబ్బందులు

పట్టించుకోని అధికారులు

తాడేపల్లిగూడెం అర్బన్, జూలై 23 (ఆంధ్రజ్యోతి): కొన్ని రోజులుగా అప్రకటిత విద్యుత్ కోతలతో ప్రజలు అల్లాడిపోతున్నారు. వేసవిని కూడా తలపించేలా విద్యుత్ కోతలు విధించడంతో ఉక్కిరి బిక్కిరవుతున్నారు. ఎప్పుడు ఉంటుందో ఎప్పుడు పోతుందో తెలియక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సాధారణంగా గాలులు వీస్తే విద్యుత్ సరఫరా నిలిపివేస్తారు. కానీ ప్రస్తుతం పరిస్థితి అలా లేదు.కొంచెం వర్షం ప్రారంభమైందంటే చాలు వెంటనే కరెంట్ తీసేస్తున్నారు. అధికారికంగా విద్యుత్ తీస్తే ముందురోజే అధికారులు ప్రకటనల ద్వారా ప్రజలకు తెలియజేస్తారు. కాలం చెల్లిన ట్రాన్స్‌ఫార్మర్లతోనే ఇటువంటి సమస్యలు ఎక్కువగా వస్తున్నాయని వినియోగదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



తాడేపల్లిగూడెంలో 33/11 కేవీ సబ్‌స్టేషన్

33/11 కేవీ లోనే ఎక్కువ సమస్యలు

తాడేపల్లిగూడెం జయలక్ష్మి థియేటర్ ఎదురుగా 33/11 కేవీ ఉంది. ఇక్కడ నుంచి కొంత భాగం తాడేపల్లిగూడెం పట్టణానికి, పెంటపాడు గ్రామానికి ఇక్కడి నుంచే విద్యుత్ ప్రసారం జరుగుతుంది. ప్రతీ సారి ఈ 33/11 కేవీలో సమస్యలు రావడం వల్లే తాడేపల్లిగూడెం నుంచి భీమవరం వైపు వెళ్ళే ప్రధాన రహదారిలో విద్యుత్ కోతలు ఎక్కువగా వస్తున్నాయి. ప్రధాన రహదారిపై గంటల తరబడి విద్యుత్ పోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.రాత్రివేళలో అయితే సమస్య మరింత జఠిలంగా ఉంటుంది. ప్రధాన రహదారిపై ఉండే వీధి దీపాలు కూడా వెలగక పోవడంతో వినియోగదారులతో పాటూ వ్యాపారస్తులు కూడా ఇబ్బందులు ఎదుర్కుంటున్నారు.

చిరు వ్యాపారుల పరిస్థితి దయనీయం

విద్యుత్‌నే నమ్ముకుని వ్యాపారాలు సాగించే చిన్న వ్యాపా రస్తులు కోతల కారణంగా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా పిండి మిల్లు, వాటర్ సర్వీసింగ్, టైలరింగ్ తదితర వ్యాపారులు విద్యుత్ కోతల కారణంగా తమ ఆదాయాన్ని కోల్పో తున్నారు. వాస్తవానికి ఇటువంటి పరిస్థితి ఎక్కువగా వేసవి కాలం లోనే వస్తూంటుంది. కానీ వర్షాకాలమైనా గాని అనధికార విద్యుత్ కోతలు విధించడంతో చాలా ఇబ్బందులు పడుతున్నారు.వృద్ధులు, చిన్నారుల పరిస్థితి దయనీయంగా ఉంది.



పెంటపాడు కుమ్మరి పుంతలో కొత్త ట్రాన్స్‌ఫార్మర్ కోసం కట్టిన సిమెంట్ దిమ్మ

విద్యుత్ హెచ్చుతగ్గులతో సమస్య

విద్యుత్ కోతలే కాదు ప్రతీ సారి అప్‌అండ్‌డౌన్ లో ఓల్టేజీ సమస్యలు వస్తున్నాయి. పెంటపాడు కుమ్మరి పుంత ఏరియాలో చాలా కాలం నుండి ఈ సమస్య ఉంది. ఎన్నిసార్లు విద్యుత్ అధికారులకు, సంబంధిత లైన్‌మేన్ కు ఈ విషయాన్ని అక్కడి స్థానికులు మొరపెట్టుకున్నా ఇప్పటికి సమస్య పరిష్కారం కాలేదు. ప్రతీసారి విద్యుత్‌లో హెచ్చు తగ్గుల కారణంగా తమ ఇంట్లో ఉన్న ఎలక్ట్రికల్ వస్తువులు కూడా పాడై పోతున్నాయని, తామందరం మధ్యతరగతి ప్రజలమని వస్తువులు పోతే కనీసం కొనుక్కునే స్థితిలో కూడా లేమని అక్కడి స్థానికులు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి విద్యుత్‌లో హెచ్చు తగ్గుల సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

హెచ్చుతగ్గుల సమస్యతో ఇబ్బంది : దుర్గ (పెంటపాడు)



విద్యుత్ కోతల కారణంగా చాలా ఇబ్బందులు పడుతున్నాం . ముఖ్యంగా మా ప్రాంతంలో విద్యుత్ హెచ్చు తగ్గుల సమస్య ఎక్కువగా ఉంది. ఇప్పటికే స్థానిక నాయకులకు, అధికారులకు అనేకసార్లు చెప్పాం. అయినా సమస్య పరిష్కారం కాలేదు. అధికారులు స్పందించి మా సమస్యను పరిష్కరించాలి

మరో ట్రాన్స్‌ఫార్మర్ వేయాలి: అన్నపూర్ణ (పెంటపాడు)



మా ప్రాంతంలో విద్యుత్ సమస్య ఎప్పటి నుంచో ఉంది. నేటికి పరిష్కారం కాలేదు. కొత్త ట్రాన్స్‌ఫార్మర్ వేయడానికి అధికారులు సిమ్మెంట్ దిమ్మను కూడా నిర్మించారు. కానీ టాన్స్‌పార్మర్ మాత్రం ఇప్పటి వరుకూ వేయలేదు. కొత్త ట్రాన్స్ ఫార్మర్ వేస్తే గాని మా ప్రాంతంలో విద్యుత్ సమస్య పరిష్కారం అవ్వదు.



గోపన్నపాలెంలో ఉన్న అగ్రిటెస్టింగ్ ల్యాబ్

లక్ష్యానికి దూరంగా అగ్రి ల్యాబ్

- రెండేళ్లలో 102 శాంపిల్స్‌తో సరి
- యంత్ర సామాగ్రి, సిబ్బంది కొరతే

దెందులూరు, జూలై 23 (ఆంధ్రజ్యోతి) : లక్షలాది రూపాయలతో దెందులూరు నియోజకవర్గంలోని గోపన్నపాలెంలోని సీతారామ ప్రభుత్వ వ్యాయామ విద్యా కళాశాల ఆవరణలో ఏర్పాటు చేసిన అగ్రి ల్యాబ్ లక్ష్యానికి దూరంగా ఉంది. మూడు శాఖల ద్వారా ఆయా వర్గాల రైతులకు సేవలందించాల్సి ఉండగా, కేవలం వ్యవసాయ, పశుసంవర్ధ శాఖల సిబ్బంది ల్యాబ్ టెస్టులకే పరిమితం అయ్యారు. మత్స్యశాఖ శాంపిల్స్ ఊసేలేదు. అదీ కూడా పూర్తిస్థాయిలో రైతులకు సేవలందటం లేదన్న ఆరోపణలున్నాయి. 2023 సంవత్సరం జూలై ఏడో తేదీన రూ.65 లక్షల నాబార్డు నిధులతో ఆర్‌కేవీవై పథకంలో డాక్టర్ వైఎస్ఆర్ అగ్రి టెస్టింగ్‌ల్యాబ్ (నియోజకవర్గ స్థాయి పశువ్యాధి నిర్ధారణ ప్రయోగ శాల) కింద సేవలందించడం ప్రారంభించారు. సరిగ్గా రెండేళ్లు అవుతున్నా ఇప్పటికీ కూడా రైతులు పంటల వినియోగంలో వాడే వివిధ రకాల ఎరువుల నాణ్యత పరీక్షించే యంత్రాలు, సిబ్బంది పూర్తిస్థాయిలోకి అందుబాటులో రాలేదు. దీంతో రైతులు తమ పంటలకు వేసే పురుగుమందులు నాణ్యమైనవో లేదా నకిలీవో తెలియక గందరగోళంలో కొట్టుమిట్టాడుతున్నారు. విత్తనం మంచిదైతే పంట బాగా పడుతుందని రైతుల నమ్మకం. అయితే మార్కెట్‌లోకి వచ్చే విత్తనాలతో పాటు, రైతులు సాగే చేసే విత్తనాల నాణ్యత పరీక్షించుకునే అవకాశం ఉన్నప్పటికీ సరైన ప్రచారం లేకపోవడంతో స్థానికంగానే రైతులు వేసే వరి వంగడాల శాంపిల్స్ పరీక్షలకు పెద్దగా రావడం లేదు. ప్రారంభించిన రెండేళ్ల నాటి నుంచి ఇప్పటి వరకు మొత్తం 102 పరీక్షలకు మాత్రమే శాంపిల్స్ వచ్చినట్లు అక్కడ సిబ్బంది చెబుతున్నారు. దెందులూరు నియోజకవర్గ పరిధిలో దెందులూరు, పెదపాడు, పెదవేగి, ఏలూరు రూరల్ మండలాల మీద 50 వేల ఎకరాల పైబడి పంటలు సాగు చేస్తుండగా, ఇందులో అగ్రభాగం వరితో పాటు అక్కడక్కడ మొక్కజొన్న సాగు చేస్తున్నారు. రైతులకు కీలకమైన వరి విత్తనాలు, అన్ని రకాలు విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు నాణ్యత పరీక్ష చేయాల్సి ఉన్నప్పటికీ అగ్రిటెస్టింగ్ ల్యాబ్‌లో సిబ్బంది కొరత, యంత్రాల కొరత వలన కేవలం విత్తనాల శాంపిల్స్ పరీక్షలకు పరిమితం అవడంపై రైతులు పెద్దగా ఆసక్తి చూపడం లేదు. ఈ నియోజకవర్గంలో వ్యవసాయంతో పాటు పాడి పరిశ్రమ ఉన్నప్పటికీ పశువ్యాధి నిర్ధారణ పరీక్షల ప్రయోగశాల సేవలు నామమాత్రంగా ఉన్నాయి. నియోజకవర్గం మొత్తం మీద లక్షకు పైగా పశు సంపద ఉండగా, ఈ ల్యాబ్‌లో పశువుల మలం, రక్తనమూనా, చర్మ, నాజిల్, బయోకెమికల్, పాలు సంబంధించి శాంపిల్స్ పరీక్షలు చేయాల్సి ఉంది. కేవలం ఈ రెండేళ్లలో 2,380 మాత్రమే పరీక్షలు నిర్వహించారు.

మత్స్యశాఖ పరీక్షలు లేనే లేవు

నియోజకవర్గస్థాయి పరిధిలో ఎంతో ఆర్భాటంగా మూడు శాఖల పరీక్షలని చెప్పి ప్రారంభించినప్పటికీ, మత్స్యశాఖ పరీక్షలు ఈ కేంద్రంలో ఇప్పటి వరకు జరగలేదు. సమస్య ఏమిటని ఆరా తీస్తే దెందులూరు నియోజకవర్గ పరిధిలో మత్స్యశాఖ రైతులు తక్కువగా ఉన్నారని, కేంద్రానికి రావడం లేదని కుంటిసాకులు చూపుతున్నారు. ఈ కారణం చూపించి ఇక్కడ సిబ్బంది, యంత్రాలను ఏర్పాటు చేయాల్సిన ఉన్నప్పటికీ అధికారుల నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలున్నాయి. సిబ్బంది, యంత్రాలను ఏర్పాటు చేసి అగ్రి టెస్టింగ్ ల్యాబ్‌ను పూర్తిస్థాయిలో వినియోగించునే విధంగా చూడాల్సిన అవసరం ఉంది.

ఏఎన్‌ఎంలకు సర్వే కష్టాలు

సర్వర్ సమస్యలతో సతమతం

ఓటీపీలు చెప్పేందుకు భయపడుతున్న జనం

లింగపాలెం, జూలై 23 (ఆంధ్రజ్యోతి): సాధారణ కార్యక్రమాలతో పాటు వివిధ రకాల ప్రభుత్వ సర్వేలన్నీ తమకే అప్పచెపుతుండటంతో తమపై పనిభారం పెరుగుతోందంటూ ఏఎన్‌ఎంలు (ఆరోగ్యకార్యకర్తలు) ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఏఎన్‌ఎంలు తమ సాధారణ విధుల్లో భాగంగా తమకు కేటాయించిన గ్రామాల్లో ప్రతిరోజూ గర్భిణులను గుర్తించి వారి వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చెయ్యడం, బాలింతలకు ఆరోగ్యపరీక్షలు, టీకాలు, 104 సిబ్బందితో కలసి వైద్య శిబిరాలలో పాల్గొనటం, కిషోరీ వికాసం వంటి పలు కార్యక్రమాలలో పాల్గొనటం చేస్తున్నారు. వీటితో పాటు కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు చేపట్టే పలు సర్వేలు, పింఛన్ల పంపిణీ కూడా వీరికి అప్పగించడంతో పని ఒత్తిడితో సతమతమవుతున్నారు. దీనికితోడు గ్రామీణ ప్రాంతాలలో సరైన సిగ్నల్స్ అందక మొబైల్‌సర్వర్లు మొరాయిస్తుండటంతో ఆన్‌లైన్‌లో నమోదు చేసేందుకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

ఇదిలా వుంటే గ్రామాల్లో అసంక్రమిత వ్యాధులు, క్యాన్సర్ వంటి ప్రాణాంతక వ్యాధులను గుర్తించేందుకు ఎన్‌సీడీ సర్వే, ప్రధానమంత్రి జన్‌ధన్ యోజన, ఆరోగ్య బీమా, హెల్త్‌కార్డులు అందించేందుకు సర్వేలు చేపట్టాలని కేంద్ర, రాష్ట్రప్రభుత్వాల ఆదేశాల మేరకు చేస్తున్న సర్వేలకు అనేక అడ్డంకులు ఎదురవుతున్నాయి. గ్రామీణ ప్రాంతాలలో వీరికి సరైన సమాచారమిచ్చేందుకు, సైబర్ నేరాల భయంతో తమ సెల్‌ఫోన్‌లకు వచ్చే ఓటీపీలు చెప్పేందుకు ప్రజలు భయపడుతున్నారు. లబ్ధిదారుల ఆధార్ కార్డులకు ఫోన్ నెంబర్ లింక్ కాకపోవడం, వేలిముద్రలు పడకపోవడంతో పాటు ఆన్‌లైన్‌లో వివరాల నమోదు సమ యంలో సర్వర్ మొరాయిస్తుండటంతో గంటల కొద్దీ సమయం పడుతుందని, సర్వే పూర్తి చేసేందుకు తాము అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని సర్వే ఆలస్యమైతే అధికారులు మెమోలు ఇచ్చేందుకు కూడా వెనుకాడటం లేదని ఏఎన్‌ఎంలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.





చివటంలో ప్రభుత్వ పనితీరును అడిగి తెలుసుకుంటున్న మంత్రి రవికుమార్, చిత్రంలో బూరుగుపల్లి శేషారావు

అర్హులైన ప్రతి ఒక్కరికీ పథకాలు

మంత్రి గొట్టిపాటి రవికుమార్

ఉండ్రాజవరం, జూలై 23 (ఆంధ్రజ్యోతి):రాష్ట్రంలో అర్హులైన ప్రతిఒక్కరికీ పథకాలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర విద్యుత్ శాఖామంత్రి గొట్టిపాటి రవికుమార్ అన్నారు. ఉండ్రాజవరం మండలంలోని చివటం గ్రామంలో బుధవారం సాయంత్రం జరిగిన సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. గ్రామంలో ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాలు అందుతున్నదీ లేనిదీ అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో కరెంట్ ఫ్యూజ్ బాక్సులు కిందకు ఉన్నాయని ప్రజలకు అందకుండా పైకి ఏర్పాటు చేయాలని ఒక మహిళ తెలిపారు. వెంటనే వాటిని ఏర్పాటు చేయాలని మంత్రి అధికారులకు సూచించారు. గ్రామంలో చెత్తను నివాసాలకు దగ్గరగా వేస్తున్నారని, వాటిని దూరంగా వేయాలని కొందరు మహిళలు మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. స్థల సేకరణచేసి చెత్తను అక్కడి నుంచి తరలించాలని మంత్రి తహసీల్దార్ ప్రసాద్‌ను ఆదేశించారు. అనంతరం గ్రామపంచాయతీ వద్ద జరిగిన రచ్చబండ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ పింఛన్లు పెంచిన ఘనత దేశంలోనే ప్రభుత్వానికి దక్కుతుందన్నారు. ప్రభుత్వ పథకాలు ప్రజల్లోకి తీసుకువెళ్లాలని సూచించారు. మండలంలో రైతులు వ్యవసాయ ట్రాన్స్‌ఫార్మర్‌లు ఏర్పాటు చేయాలని కోరారని, వీటిని త్వరలో ఏర్పాటుకు చర్యలు తీసుకుంటానని మంత్రి హామీ ఇచ్చారు. రాష్ట్ర స్కిల్ డవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్, నియోజకవర్గ ఇన్‌చార్జి బూరుగుపల్లి శేషరావు మాట్లాడుతూ గత ప్రభుత్వం రాష్ట్రంలోని అన్ని వ్యవస్థలను భ్రష్టు పట్టించిందన్నారు. కార్యక్రమంలో ఏపీఎస్ఐడీసీ చైర్మన్ మంతెన రామరాజు, నియోజవర్గ పరిశీలకుడు డీవీ సత్యనారాయణ, నిడదవోలు పట్టణ టీడీపీ అధ్యక్షుడు కొమ్మిన వెంకటేశ్వరరావు, ఉండ్రాజవరం మండల టీడీపీ అధ్యక్షుడు సింహాద్రి రామకృష్ణ, పెరవలి మండల అధ్యక్షుడు అతికాల శ్రీను, ఎంపీటీసీ సభ్యుడు వి.సత్యనారాయణ, ఏఎంసీ చైర్మన్ గాలింకి జిన్నాబాబు, గ్రామటీడీపీ అధ్యక్షుడు చిలుకూరి శ్రీను, క్లస్టర్ ఇన్‌చార్జిలు వెలిచేటి ప్రసాద్, ముళ్లపూడి పాండురంగ, ఈర్పిన సత్యనారాయణ, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వేతన సవరణ వెంటనే అమలు చేయాలి

పశ్చిమ గోదావరి జిల్లా ఫ్యాప్టో చైర్మన్ విజయ రామరాజు

పాలకోడేరు, జూలై 23 (ఆంధ్రజ్యోతి) : 12వ వేతన సవరణ అమలుకు కమిషన్ నియమించాలని, మధ్యంతర భృతి వెంటనే మంజూరు చేయాలని, పెండింగ్‌లో ఉన్న కరువు భత్యం, పాత బకాయిలు వెంటనే విడుదల చేయాలని పశ్చిమ గోదావరి జిల్లా ఫ్యాప్టో చైర్మన్ పీఎస్ విజయ రామరాజు, సెక్రటరీ జనరల్ జి.ప్రకాశం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. దీనికి సంబంధించి బుధవారం పాత్రికేయుల సమావేశంలో వారు మాట్లాడుతూ 2023 జూలై నెల నుంచి ఉద్యోగులకు వేతన సవరణ జరగాల్సి ఉందని, రెండేళ్ళు గడిచినా ఇంత వరకు దాని గురించి ప్రభుత్వం ఆలోచన చేయడం లేదని, అందువల్ల తక్షణమే 12వ వేతన సవరణ కమిషన్ ఏర్పాటు చేయవలసినదిగా డిమాండ్ చేశారు. 2023 జూలై నెల నుంచి ఉపాధ్యాయులకు మధ్యంతర భృతి చెల్లించాలని డిమాండ్ చేశారు. సీపీఎస్ రద్దు చేసి, 2003 ముందు నియామకం పొందిన వారికి కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన మెమో నెంబర్ 57ను అమలు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని కోరారు. బదిలీలు పొందిన ఉపాధ్యాయులకు ఇంకనూ పొజిషన్ ఐడీలు లేక జీతాలు అందలేక ఇబ్బందులు పడుతున్నారని, వెంటనే ఈ సమస్యను ప్రభుత్వం పరిష్కరించి వారికి జీతాలు అందజేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కో-చైర్మన్ సాయివర్మ, డిప్యూటీ సెక్రటరీ జనరల్ వెంకటేశ్వరరావు, రమణ తదితరులు పాల్గొన్నారు.



ఎంపీడీవో కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న వైసీపీ నాయకులు

సర్పంచ్ చెక్ పవర్ రద్దు చేయడంపై వైసీపీ ధర్నా

పోడూరు, జూలై 23 (ఆంధ్రజ్యోతి): పండితవిల్లూరు సర్పంచ్ ఇళ్ల లక్ష్మీచంద్రిక చెక్ పవర్ రద్దుపై పోడూరు ఎంపీడీవో కార్యాలయం వద్ద నియోజకవర్గంలోని ఆయా గ్రామాల సర్పంచ్‌లు, వైసీపీ నాయకులు ధర్నా నిర్వహించారు. జడ్పీటీసీ గుంటూరి పెద్దిరాజు మాట్లాడుతూ టీడీపీ నాయకుల ప్రమేయంతోనే సర్పంచ్ చెక్ పవర్ అధికారులు రద్దు చేశారని ఆరోపించారు. అధికార పార్టీ నాయకులకు కొమ్ముకాస్తున్నారని విమర్శించారు. సర్పంచ్ చెక్ పవర్‌ను పునరుద్ధరించి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం ఎంపీడీవోకి వినతిపత్రం అందచేశారు. వైసీపీ నాయకులు పిల్లి నాగన్న, గుబ్బల వీరబ్రహ్మం ఎంపీపీలు,జడ్పీటీసీలు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

టీడీపీకి సంబంధం లేదు



సర్పంచ్ లక్ష్మీచంద్రిక 2022 నుంచి వైసీపీ ప్రభుత్వ హయాంలోనే పంచాయతీ నిధులు దుర్వినియోగానికి పాల్పడిందన్న ఫిర్యాదుపై అధికారులు విచారణ చేసి ఆమె చెక్కు పవర్‌ను రద్దు చేశారనీ దీనిలో టీడీపీకి ఎటువంటి సంబంధం లేదని అనవసరంగా బురద జల్లే ప్రయత్నం చేయవద్దంటూ టీడీపీ నాయకులు అన్నారు. పండిత విల్లూరు పంచాయతీ కార్యాలయంలో బుధవారం విలేఖర్ల సమావేశంలో పంచాయతీ వార్డు సభ్యులు నామాల పణీంద్ర, నెక్కంటి శివదుర్గ నాగేశ్వరరావు, ఆళ్ల సత్యవతితో పాటు మాజీ సర్పంచ్ కొరిపల్లి రామచంద్రరావు, టీడీపీ నాయకులు గణపతినీడి రాంబాబు, రామకృష్ణ, కుక్కల వెంకటేశ్వరరావు పాల్గొని మాట్లాడారు.

ఆశ్రంలో బీఎస్సీ హెల్త్ సైన్స్‌పై అవగాహన

ఏలూరు, మే 23 (ఆంధ్రజ్యోతి) : ఆశ్రం మెడికల్ కాలేజీకి అను సంధానమైన ఆశ్రం కాలేజీ ఆఫ్ ఎల్లైడ్ హెల్త్ సైన్సెస్‌లో ఇంటర్మీడియట్ బైపీసీ పూర్తి చేసిన విద్యార్థులకు బీఎస్సీ ఎల్లైడ్ హెల్త్ సైన్సెస్ కోర్సులపై అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు హాస్పిటల్ యాజమాన్యం తెలిపింది. ఆసక్తి గల విద్యార్థులు ఈనెల 25, 26వ తేదీన ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 3 గంటల సమయంలో ఇన్‌స్టిట్యూట్‌కి వచ్చి పూర్తి వివరాలు తెలుసుకోవచ్చని వివరించారు. మరిన్ని వివరాలకు 73826 26293 నంబర్‌లో సంప్రదించాలని తెలిపారు.

అంగన్‌వాడీల్లో గ్యాస్ కష్టాలకు చెక్

అంగన్‌వాడీ కేంద్రాల్లో గ్యాస్ కష్టాలను తీర్చేందుకు ప్రభుత్వం చర్యలకు ఉపక్రమించింది. గడిచిన ఏడాది కాలంలో అంగన్‌వాడీ కేంద్రాల పటిష్టతపై పూర్తిస్థాయిలో రాష్ట్ర ప్రభుత్వం దృష్టి కేంద్రీకరించింది. తాజాగా గ్యాస్ సిలిండర్ల సమస్యను అధిగమించేందుకు విద్యుత్ సాయంతో నడిచే ఇండక్షన్ స్టవ్‌లు ఇవ్వనున్నారు.

(ఏలూరు-ఆంధ్రజ్యోతి)

- 3 అర్బన్ ప్రాజెక్టులకు ఇండక్షన్ స్టవ్‌లు
- పైలట్ ప్రాజెక్టుగా 405 సెంటర్లకు కేటాయింపులు
- ప్రజాప్రతినిధులు చేతుల మీదగా త్వరలో అందజేత



ఏలూరు జిల్లాలో పైలట్ ప్రాజెక్టుగా మొత్తం 405 ఇండక్షన్ స్టవ్‌లు, వంటలు చేసేందుకు నాలుగు కాపర్ కోటెడ్ వంటపాత్రలు రాష్ట్ర కార్యాలయం నుంచి జిల్లా ప్రాజెక్టు కార్యాలయానికి చేరుకున్నాయి. జిల్లా వ్యాప్తంగా 2225 అంగన్‌వాడీ కేంద్రాలకు గాను ఏలూరు సీడీపీవో ప్రాజెక్టు పరిధిలో 205 కేంద్రాలకు, జంగారెడ్డిగూడెం ప్రాజెక్టుకు 83, నూజివీడుకు 117 స్టవ్‌లు, పాత్రలు చేరుకున్నాయి. వీటిని ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారుల చేతుల మీదుగా అంగన్‌వాడీ సెంటర్లకు పంపిణీ చేయన్నారు. ముందుగా వీటి వినియోగంపై అంగన్‌వాడీ సిబ్బంది ఆయ కంపెనీల ప్రతినిధులు శిక్షణ ఇవ్వనున్నారు. అందులో భాగంగా వంటలకు ఉపయోగించే గ్యాస్ ఆధారిత పొయ్యిల స్థానంలో విద్యుత్ సాయంతో నడిచే ఇండక్షన్ స్టవ్‌లను అందివ్వనుండటంతో సిలెండర్ల బిల్లులు ఎదురు చూపులు కష్టాలు అంగన్‌వాడీకు తగ్గాయి.

భవిష్యత్‌లో సోలార్‌తోనే వంటలు..

పైలట్ ప్రాజెక్టుగా మూడు నగరాలు, పట్టణాల్లో ఇండక్షన్ స్టవ్‌లను వినియోగించాక.. ఆ తదుపరి జిల్లా అంతటా విస్తరిస్తారు. ప్రధానంగా గ్యాస్ సిలిండర్ అయిపోతే పిల్లల వంటకు పడే కష్టాలు అన్నీ ఇన్నీ కావు. ఈ బిల్లులు బడ్జెట్ ప్రకారం విడుదల కానుండటంతో నెలలు తరబడి పెండింగ్‌లో ఉండటంతో సిబ్బంది ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారు. సకాలంలో గ్యాస్ సరఫరా కాకపోవడం, ఇతర ఇబ్బందులు దృష్ట్యా వీటిని పంపిణీ చేస్తోంది. ఇప్పటి వరకు ఏజెన్సీల నుంచి గానీ, ప్రైవేట్ వ్యక్తులు గానీ కేంద్రాలకు సిలిండర్లను సరఫరా చేసేవారు. వారికి ప్రభుత్వం నేరుగా నగదు జమ చేసేది. గత ప్రభుత్వ హయాంలో బకాయిలు ఉండ డంతో చాలా మంది ముందుకు రాక.. సకాలంలో వంట పూర్తయ్యేది కాదు. ఆ కష్టాలు ఇక దూరం కానున్నాయని అంగన్‌వాడీలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.. కాగా రాబోయే రోజుల్లో సోలార్‌తో ఇండక్షన్ స్టవ్‌లు వినియోగంపైన ప్రభుత్వం దృష్టి సారించిందని చెబుతున్నారు. ఇప్పటికే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాలతో సోలార్‌పై విస్తృత ప్రచారం జరుగుతోంది. అందులో భాగంగానే సోలార్ వినియోగం కూడా అంగన్‌వాడీల్లో విస్తరించే యోచన ఉంది. ఇది గ్రామాల్లో అమలు చేస్తారా? అనే చర్చ సాగుతోంది. దీని వల్ల పర్యావరణ పరంగాను, ఆరోగ్యపరంగా ఉపయుక్తమే.



నూగొండపల్లిలో సిద్ధంగా ఉంచిన మట్టి గుట్టలు

సాయిల్.. ఎనీటైం ఫర్ సేల్!

నూజివీడు, జూలై 23 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం అనుమతించిన ఇసుక ర్యాంపు కాదు ఇది. ఎలాంటి అనుమతులు లేని సాయిల్ ర్యాంప్. వర్షాలు ప్రారంభం కావడంతో చెరువుల్లో మట్టి తవ్వకాలకు ఇబ్బంది కాబట్టి ముందుగానే చెరువుల నుంచి మట్టిని అక్రమంగా తోలి సమీపంలోని ఒక పొలంలో పెద్దగుట్టుగా పోసి ఎనీ టైం సాయిల్ అమ్మకానికి కొందరు అధికార పార్టీ నేతలు ఏర్పాటు చేసిన సాయిల్ డెన్ ఇది. సాయిల్‌ను ఇలా అక్రమంగా గుట్టలుగా పోయడానికి అనుమతులు ఉండవు. మట్టి తవ్వకాలు, అమ్మకాలలో లాభం రుచిచూసిన ఈ మట్టి మాఫియా వర్షాలు పడినా తమ వ్యాపారానికి ఎలాంటి విరామం లేకుండా మట్టిని గుట్టలుగా పోసి అమ్ముకుంటున్నారు. ఆగిరిపల్లి మండలం నూగొండపల్లి గ్రామ పరిధిలోని చెరువులోని మట్టిని పక్కనే ఒక పొలంలో ఇలా గుట్టలుగా పోసి ఉంచారు. అలాగే కొత్త ఈదర గ్రామంలోని చెరువు మట్టిని అక్కడే ఒక పక్కన గుట్టలుగా పోసి రెడీ ఫర్ సేల్‌కు ఉంచారు. ఇవేకాదు నూజివీడులోని కొన్ని గ్రామాలు, ముసునూరు మండలంలోని చిల్లబోయినపల్లి గ్రామంలోనూ అక్రమ మట్టి తవ్వకాలు గంటకు మూడు ట్రాక్టర్లు ఆరు టిప్పర్లుగా సాగుతున్నాయి. ఈ సాయిల్ డెన్‌లు అధికారులకు కనబడితే ఒట్టు. ఈ మట్టి గుట్టల గురించి బుధవారం ఆగిరిపల్లి తహసీల్దార్‌కు రాతపూర్వక పిర్యాదు అందింది. ఏం జరుగుతుందో చూడాలి.

చెప్పులు, చీపుళ్లతో తిరగబడతారు..

- టీడీపీ ముసుగులో వైసీపీ గూండాల అరాచకం
- సహించేది లేదన్న ఇంటెలిజెన్స్ మాజీ చీఫ్ ఏబీవీ



విలేకరులతో మాట్లాడుతున్న ఏబీ వెంకటేశ్వరరావు

నూజివీడు, జూలై 23(ఆంధ్రజ్యోతి): నూజివీడు మండలం ముక్కొల్లుపాడులో టీడీపీ ముసుగులో వైసీపీ గూండాల అరాచకాలను సహించేది లేదని ఇంటెలిజెన్స్ మాజీ చీఫ్ ఏబీ వెంకటేశ్వరరావు స్పష్టం చేశారు. బుధవారం నూజివీడు వెలుగు కార్యాలయం వద్ద ఆయన విలేకరులతో మాట్లాడుతూ ముక్కల్లుపాడులో డ్వాక్రా బుక్ కీపర్ పద్మ అనే బీసీ మహిళను అక్రమంగా తొలగించడానికి అధికార పార్టీ ముసుగులో ఈ వైసీపీ నాయకులు ప్రయత్నించడమే కాక ఆమెకు మద్దతుగా ఉన్నవారిపై దాడులు చేస్తుండటంతో ముక్కొల్లుపాడు గ్రామస్థుడిగా ఈ అన్యాయాన్ని సహించలేక తాను అధికారులను కలిసి పరిస్థితిని వివరించి నిబంధనలు పాటించమని కోరడానికి వెలుగు కార్యాలయానికి, నూజివీడు రూరల్, పట్టణ పోలీస్ స్టేషన్‌లకు వచ్చినట్లు తెలిపారు. పద్మ కుటుంబం టీడీపీ సానుభూతిపరులు కావడంతో వైసీపీ నుంచి టీడీపీలోకి వచ్చిన ఈ గ్రామ నాయకులు గతంలో తమకు వ్యతిరేకంగా వ్యవహరించిన పద్మను వేధించటానికి ఇప్పుడు అధికార పార్టీ ముసుగు వేసుకొని ఆమెను తొలగించడానికి తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారన్నారు. ఆమెకు మద్దతుగా ఉన్న వారిపై దాడులు చేయడమే కాక ఆమె నుంచి రికార్డులను సైతం దొంగలించడానికి ప్రయత్నాలు చేశారని వీటిపై పోలీసులకు ఫిర్యాదు చేసినా ఇంతవరకు చర్యలు తీసుకోకపోవడంతో తాను సంబంధిత అధికారులను కలిసి నిబంధనలను పాటించి న్యాయం చేయాలని కోరినట్లు వివరించారు. టీడీపీలోకి వచ్చిన ఈ ముఠా గ్రామంలో రోజుకో కేసు పెడుతూ ప్రశాంతతను పాడు చేస్తోందన్నారు. ఈ ముఠా వెనుక గ్రామంలో పాత పెత్తందారులు ఉన్నారన్నారు. పరిస్థితి మారకపోతే గ్రామంలో మహిళలు చెప్పులు, చీపుళ్లతో వీరి భరతం పడతారన్నారు. పార్టీ మారినంత మాత్రాన ఆబోతులు ఆవులు కావన్నారు. తొలుత ఏబీ వెంకటేశ్వరరావు వెలుగు కార్యాలయం సీసీ కుమారితో మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు. తనకు బుక్ కీపర్‌ను తొలగించే అధికారం లేదని ఆమె సమాధానం చెప్పడంతో నిబంధనలు పాటించి అందరినీ సమావేశపరిచి మెజార్టీ సభ్యుల అభిప్రాయాల ప్రకారం నడుచుకోవాలని ఆమెను కోరారు. కాగా కొత్త రావచర్లకు చెందిన కే లక్ష్మీసుజాత అనే మరో బుక్ కీపర్ తనపై సభ్యులు ఎలాంటి ఫిర్యాదులు చేయకపోయినా తనను తొలగించాలని గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు ఒత్తిడి చేస్తున్నారని తన పనులను అడ్డుకుంటున్నారని ఆరోపించారు. తాను కోర్టుకు వెళ్లి స్టే తెచ్చుకొన్నా తనను విధుల్లోకి తీసుకోవడం లేదని ఆమె ఏబీవీకి, విలేకరులకు తెలిపారు. దీనిపై సీసీ కుమారిని వివరణ కోరగా ఆమెను బుక్‌కీపర్‌గా తొలగించలేదని ఆమె స్థానంలో మరొకరు పని చేస్తున్న విషయం తనకు తెలియదన్నారు. త్వరలో సభ్యులందరినీ సమావేశపరిచి నిబంధనల ప్రకారం నిర్ణయం తీసుకుంటామని ఏబీకి తెలిపారు. అక్కడ నుంచి ఆయన నూజివీడు రూరల్, టౌన్ పోలీస్ స్టేషన్లలో ఎస్ఐలను కలసి పద్మ దగ్గర నుంచి రికార్డులు అపహరించడానికి ప్రయత్నించిన కేసు దర్యాప్తు ఎంత వరకు వచ్చిందని తెలుసుకున్నారు. అలాగే గ్రామంలో సదరు మహిళలను వెలుగు కార్యాలయానికి ఫిర్యాదు చేయడానికి తీసుకువచ్చిన ఆటో డ్రైవర్‌పై ఈ ముఠా చేసిన దాడిలో గాయపడ్డ వ్యక్తి పెట్టిన కేసు దర్యాప్తు ఎంత వరకు వచ్చిందని అడిగి, నిష్పక్షపాతంగా దర్యాప్తు చేసి ఎవరి తప్పుంటే వారిపై కేసు నమోదు చేయాలని పోలీస్ అధికారులకు ఆయన విజ్ఞప్తి చేశారు.



భీమవరంలో విలేకరులతో మాట్లాడుతున్న దర్శకుడు రవీందర్

యథార్థ ఘటనే..

రాజు గాని సవాల్

ఏలూరు రూరల్/భీమవరం టౌన్, జూలై 23 (ఆంధ్రజ్యోతి): లెలిజాల రవీందర్ కథానాయకుడిగా స్వీయ దర్శకత్వంలో నిర్మిస్తున్న చిత్రం 'రాజు గాని సవాల్' చిత్ర ప్రమోషన్‌లో భాగంగా బుధవారం భీమవరం ఏవీజీ స్ర్కీన్‌లో, సాయంత్రం ఏలూరు సత్యనారాయణ థియేటర్లో విలేకరులతో కథానాయకుడు రవీందర్ మాట్లాడారు. తన జీవితంలో జరిగిన కొన్ని ఘటనల ఆధారంగా ఈ చిత్రాన్ని తెరకెక్కించామన్నారు. కల్చరల్ ఈవెంట్స్ నేపథ్యంలో కథ సాగుతుందని, ప్రేక్షకులకు వినోదంతో పాటు మంచి సందేశం ఇచ్చే చిత్రమన్నారు. ఇద్దరు హీరోయిన్స్ సంధ్య రాథోడ్, రితికా చక్రవర్తి నటిస్తున్నారని, ప్రతి పాటా అందరికీ నచ్చుతుందని, ఇప్పటికే విడుదలైన సినిమా టీజర్, ట్రైలర్, పాటలకు అద్భుత స్పందన వస్తోందన్నారు. వచ్చే నెల 8న ఈ చిత్రం విడుదల చేస్తున్నామని, ప్రేక్షకులు ఆదరించాలని కోరారు. హీరోయిన్ రితికా చక్రవర్తి మాట్లాడుతూ ఈ చిత్రం అన్ని వర్గాల ప్రజలకూ నచ్చుతుందన్నారు. పవన్ కల్యాణ్ నూతన చిత్రం హరిహర వీరమల్లు చిత్రంలో ఈ చిత్ర ట్రైలర్ వస్తుందని అన్నారు. బాపిరాజు, రాజేష్, సత్యనారాయణ, స్వామి తదితరులు పాల్గొన్నారు.

భార్యను హతమార్చిన 85 ఏళ్ల భర్త అరెస్టు

ఏలూరు క్రైం, జూలై 23(ఆంధ్రజ్యోతి): క్షణికావేశంలో కట్టుకున్న భార్యను విచక్షణా రహితంగా కర్రతో కొట్టి హతమార్చిన బొబ్బా లక్ష్మణరావు(85)ను ఏలూరు త్రి టౌన్ పోలీసులు బుధవారం అరెస్టు చేశారు. పెదపాడు మండలం రాజుపాలెం గ్రామానికి చెందిన బొబ్బా లక్ష్మణరావు, బొబ్బా రంగమ్మ(75)కు ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. ఇద్దరు కుమార్తెలు ఏలూరు శ్రీరామ్‌నగర్‌లో ఒకేచోట ఉంటున్నారు. స్వగ్రామంలో ఒంటరిగా ఉంటున్న వృద్ధతల్లిదండ్రుల ఆలనాపాలన చూసుకోవాలను ఉద్దేశంతో శ్రీరామ్‌నగర్‌లోనే ఒక ఇల్లు అద్దెకు తీసుకుని ఉంచారు. వారి వద్ద పని చేయడానికి ఒక మహిళను కూడా ఏర్పాటు చేశారు. ఈ ఏడాది జూన్ 15న లక్ష్మణరావుకు, రంగమ్మకు గొడవ జరిగింది. దీంతో లక్ష్మణరావు ఆగ్రహంతో మంచంపై పడుకున్న రంగమ్మను కర్రతో విచక్షణారహితంగా దాడి చేయడంతో అక్కడికక్కడే మరణించింది. ఈ సంఘటనపై ఏలూరు త్రి టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. లక్ష్మణరావుకు గతంలోనే ఎడమ కాలు సగంపైనే తీసివేశారు. ఇంటిలో చక్రాల బండిపైనే ఉంటాడు. హత్య కేసులో లక్ష్మణరావును బుధవారం త్రిటౌన్ సీఐ వి.కోటేశ్వరరావు అరెస్టు చేసి కోర్టుకు హాజరుపరిచారు.

బావను హతమార్చిన బావమరిదికి జీవితఖైదు

ఏలూరు క్రైం, జూలై 23(ఆంధ్రజ్యోతి): అక్కను తన కళ్లముందే బావ కొట్టాడనే కోపంతో మేదర కత్తితో వెంటబడి తలనరికి హతమార్చినట్టు నేరం రుజువుకావడంతో జీవిత ఖైదు, వెయ్యి రూపాయల జరిమానా విధిస్తూ ఏలూరులోని రెండవ అదనపు జిల్లా సెషన్స్ జడ్జి యు.ఇందిరా ప్రియదర్శిని బుధవారం తీర్పు చెప్పారు. విజయవాడలోని సింగ్‌నగర్ న్యూ రాజేశ్వరిపేటలో నివాసం ఉంటున్న పవర్ రాజేష్(31)కి భార్య పవర్ ఎల్లమ్మ(30)ఒక కొడుకు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఎల్లమ్మ చెల్లి నందిని భర్త మరణించడంతో రాజేశ్ నందినీతో వివాహేతర సంబంధం కొనసాగిస్తున్నాడు. ఈ విషయం ఎల్లమ్మకు తెలిసి ఏలూరు రూరల్ మండలం వెంకటాపురం పంచాయతీ సెంచుల కాలనీలో ఉన్న తన సోదరుడు తంగా పాండ్యన్ అలియాస్ బంగారం (27) వద్దకు వచ్చి ఉంటూ చెత్త కాగితాలు ఏరుకుంటూ తన పిల్లలను పోషించుకుంటోంది. 2021 మే నెల 20వ తేదీ ఉదయం విజయవాడ నుంచి రాజేష్ ఎల్లమ్మ వద్దకు వచ్చి తనతోపాటు వచ్చేయాలని కోరాడు. దీనికి ఆమె నిరాకరించడంతో కొట్టాడు. దీంతో ఆగ్రహించిన ఎల్లమ్మ సోదరుడు తంగా పాండ్యన్ మేదర కత్తితో రాజేష్‌ను నరికాడు. దీంతో రాజేశ్ అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ సంఘటనపై అప్పటి ఏలూరు రూరల్ ఎఎస్ఐ కె.వెంకటేశ్వరరావు కేసు నమోదు చేయగా అప్పటి రూరల్ సీఐ ఎ.శ్రీనివాసరావు కేసు దర్యాప్తు చేసి హంతకుడైన పాండ్యన్‌ను అరెస్టు చేశారు. ఈ కేసు ఏలూరులోని రెండవ అదనపు జిల్లా సెషన్స్ కోర్టులో విచారణ సాగింది. తంగా పాండ్యన్‌పై నేరం రుజువు కావడంతో రెండవ అదనపు జిల్లా సెషన్స్ జడ్జి యు.ఇందిరా ప్రియదర్శిని బుధవారం తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ తరఫున ఏపీపీ చింతమనేని రమేష్ వాదించగా ప్రాసిక్యూషన్‌కు కోర్టు మానిటరింగ్ సెల్ ఇన్‌స్పెక్టర్ ఎం.సుబ్బారావు ఆధ్వర్యంలో హెడ్‌కానిస్టేబుళ్ళు నాగేశ్వరరావు, ఎం.శ్రీనివాసరావు, ఏలూరు వన్‌టౌన్ సీఐ జి.సత్యనారాయణ, ఏలూరు రూరల్ ఎస్ఐ దుర్గా ప్రసాద్, హెడ్‌కానిస్టేబుల్ నాగేంద్ర కుమార్, హోంగార్డు రవి రాజాలు సహకరించారు.

బాలికపై అత్యాచారయత్నం.. పోక్సో కేసు నమోదు

భీమవరం క్రైం, జూలై 23(ఆంధ్రజ్యోతి): రెండవ తరగతి చదువుతున్న ఎనిమిదేళ్ల బాలికపై యువకుడు అత్యాచార యత్నం చేసిన దారుణ ఘటన భీమవరం పట్టణంలో చోటు చేసుకుంది. చిన్న చిన్న పనులు చేసుకుంటూ ఒక కుటుంబం పట్టణంలో జీవనం సాగిస్తోంది. వారికి ఒక కుమార్తె, కుమారుడు ఉన్నారు. పట్టణానికి చెందిన కారెం తేజ(26) అనే యువకుడు బాలికపై కన్నేశాడు. ఈ నేపథ్యంలో బుధవారం తెల్లవారు జామున 2 గంటల సమయంలో ఆ బాలిక ఉంటున్న గదిలోకి ప్రవేశించి కేకలు వేస్తే చంపేస్తానంటూ భయపెట్టి అత్యాచార యత్నానికి ప్రయత్నించాడు. భయపడిన బాలిక కేకలు వేయడంతో ఆ యువకుడు పారిపోయాడు. అనంతరం బాలిక భయపడుతూ తల్లిదండ్రులకు జరిగిన విషయం చెప్పింది. ఈ ఘటనపై తల్లిదండ్రులు పోలీసులను ఆశ్రయించగా యువకుడిపై పోక్సో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ కృష్ణాజీ తెలిపారు. ప్రస్తుతం ఆ యువకుడు పోలీసుల అదుపులో ఉన్నట్లు సమాచారం.

పొలం కోసం భార్యను హతమార్చి..



కేసు వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ

ఏలూరు క్రైం, జూలై 23(ఆంధ్రజ్యోతి): తమకు ఉన్న 33 సెంట్ల పొలం (చెరువు)ను విక్రయించడానికి భర్త ప్రయత్నించగా అడ్డుపడుతున్న భార్యను అతి కిరాతకంగా కత్తితో నరికి హతమార్చిన భర్తను ఏలూరు డీఎస్పీ డి.శ్రావణ్ కుమార్ ఆధ్వర్యంలో కైకలూరు రూరల్ సీఐ వీరా రవి కుమార్ అరెస్టు చేశారు. బుధవారం రాత్రి ఏలూరు డీఎస్పీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డీఎస్పీ డి శ్రావణ్‌కుమార్ కేసు వెల్లడించారు. కలిదిండి మండలం కట్టావానిపాలేనికి చెందిన కట్టా పెద్దిరాజు (48)కి భార్య జయలక్ష్మి (44) పిల్లలు ఉన్నారు. వీరికి ఉన్న 33 సెంట్ల పొలాన్ని విక్రయించడానికి భర్త పెద్దిరాజు ప్రయత్నిస్తుండగా భార్య జయలక్ష్మి అడ్డుపడుతోంది. దీంతో ఈ నెల 10న తెల్లవారు జామున నిద్రిస్తున్న జయలక్ష్మిని అతి కిరాతకంగా నరికేశాడు. తనూ మెడ కోసుకున్నాడు. అప్పటి నుంచి ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్న పెద్దిరాజు బుధవారం డిశ్చార్జ్ కావడంతో ఏలూరు ప్రభుత్వాస్పత్రి వద్ద అరెస్టు చేశారు. విలేకరుల సమావేశంలో డీఎస్పీ శ్రావణ్‌కుమార్‌తో పాటు సీఐ రవికుమార్, ఎస్ఐ వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

అదృశ్యమైన విద్యార్థి ఆత్మహత్య



ముసునూరు, జూలై 23 (ఆంధ్రజ్యోతి):చదవడం ఇష్టంలేక లోపూడి ఎస్సీ కాలనీకి చెందిన ఇంటర్ విద్యార్థి చందు(17) ఆత్మహత్య చేసుకున్నాడు. బి.గోపాలరావుకు కుమార్తె రజిత, కుమారుడు దానియేలు (చందు)ఉన్నారు. చందు విస్సన్నపేటలోని ప్రైవేటు కాలేజీలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. ఈ నెల 21న సెలవులపై కాలేజీ నుంచి బయల్దేరిన చందు ఇంటికి రాకపోవడంతో మంగళ వారం రాత్రి తండ్రి గోపాలరావు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఇంటి పక్కనే ఉన్న చర్చి నుంచి బుధ వారం దుర్వాసన రావడంతో కుటుంబ సభ్యులు లోపలికి వెళ్లి చూడగా, చందు బాత్రూమ్‌లో ఉరి వేసుకుని విగతజీవిగా ఉన్నాడు.సమాచారం అందు కున్న ఎస్ఐ చిరంజీవి ఘటనా స్థలానికి చేరుకుని, చందు మృతికి గల కారణాలపై విచారణ జరిపి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నూజివీడు ఏరియా ఆసుపత్రికి తరలించారు. హాస్టల్‌లో ఉండి చదువుకోవడం ఇష్టం లేక చందు ఆత్మహత్య చేసుకున్నట్లు కుటుంబ సభ్యులు చెప్పినట్లు ఎస్ఐ తెలిపారు. తండ్రి గోపాలరావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఆయన చెప్పారు.

లారీఢీకొని ఇద్దరికి తీవ్ర గాయాలు

భీమడోలు, జూలై 23(ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనాన్ని లారీ ఢీకొట్టిన ప్రమాదంలో ఇరువురికి తీవ్ర గాయాలైన ఘటన సూరప్పగూడెం జాతీయ రహదారిపై జరిగింది. ద్వారకాతిరుమల మండలం తిరుమలంపాలెం గ్రామానికి చెందిన ఎం కొండయ్య, టి.రామకృష్ణలు విజయవాడలో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బంధువులను పరామర్శించేందుకు మోటార్ సైకిల్‌పై వెళ్తుండగా సూరప్పగూడెం సమీపంలో పెట్రోల్ కోసం మోటార్ సైకిల్‌ని రాంగ్ రూట్‌లో పోనిచ్చారు. ఎదురుగా వస్తున్న లారీ వీరిని ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో ఇరువురికి గాయాలు కాగా ఒకరి పరిస్థితి విషమంగా ఉంది. ఈ ఘటనపై ఎస్ఐ సుధాకర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

'పింఛన్ల పంపిణీ విధులు మాకు కేటాయించొద్దు'

తాడేపల్లిగూడెం రూరల్, జూలై 23(ఆంధ్రజ్యోతి):గ్రామాల్లో సేవలందించే ఆశా కార్యకర్తలకు పింఛన్లు పంపిణీ చేసే విధులు కేటాయించవద్దని మండలంలోని ఆశా కార్యకర్తలు బుధవారం ఎంపీడీవో ఎం.విశ్వనాథ్‌కు వినతిపత్రం సమర్పించారు. అత్యవసర పరిస్థితుల్లో తాము ఆసుపత్రుల్లో ఉండాల్సి వస్తుందని ఆ సమయంలో పింఛన్లు పంపిణీ విధులు కేటాయిం చడం ఇబ్బందికరంగా ఉంటుందన్నారు. ఆశా వర్కర్‌ల మండల కన్వీనర్ దుర్గాభవాని, సీఐటీ యూ నాయకులు కండెల్లి సోమరాజు, ఎం.దేవి, పి.అనంతలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

'పాడి పశువులతో అధిక ఆదాయం'

అత్తిలి, జూలై 23(ఆంధ్రజ్యోతి): పాడిపశువులను సంరక్షించడం ద్వారా అధిక ఆదాయాన్ని పొందచ్చని మండల ప్రత్యేక అధికారి కె.మురళీకృష్ణ అన్నారు. అత్తిలి మండలం వరిఘేడు, అత్తిలి గ్రామాలలో నిర్వహించిన 'పొలం పిలుస్తోంది' కార్యక్రమాల్లో ఆయన పాల్గొని పలు పథకాలను వివరించారు. ఏవో రాజేష్ మాట్లాడుతూ ఆగస్టు 15లోపు పంటల బీమా ప్రీమియం చెల్లించాలన్నారు. టీడీపీ మండల అధ్యక్షుడు పోలిశెట్టి చందు, కార్యదర్శి ఆల్తి అజయ్, ఆనాల ఆది నారాయణరావు, కె.సత్యనారాయణప్రసాద్, వరిఘేడు ఎంపీటీసీ త్రిమూర్తులు పాల్గొన్నారు.



ఇండోర్ స్టేడియం నిర్మాణానికి విరాళం అందిస్తున్న దాతలు

దాతల సహకారంతోనే అభివృద్ధి సాధ్యం

తాడేపల్లిగూడెం/తాడేపల్లిగూడెం రూరల్, జూలై 23(ఆంధ్రజ్యోతి): దాతల సహకారంతోనే అభివృద్ధి సాధ్యమని ప్రభుత్వం విప్ బొలిశెట్టి శ్రీనివాస్ పేర్కొన్నారు. తాడేపల్లిగూడెంలో ఎమ్మెల్యే ఆర్థిక సహకారంతో నిర్మిస్తున్న ఇండోర్ స్టేడియం, షటిల్ కోర్టు నిర్మాణానికి ప్రముఖ కంటి వైద్యనిపుణులు డాక్టర్ జీఆర్‌రెడ్డి తనయుడు సందీప్‌రెడ్డి రూ.4లక్షల విరాళాన్ని అందజే శారు. ఈ మేరకు ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ క్యాంపు కార్యాలయంలో కలిసి చెక్కును అందజేశారు.

ఇండోర్ స్టేడియానికి మరో రూ.5లక్షల విరాళం..

తాడేపల్లిగూడెంలో నిర్మిస్తున్న ఇండోర్ స్టేడియం, షటిల్ కోర్టు నిర్మాణానికి పట్టణానికి చెందిన ప్రముఖ వైద్యులు కొండ్రెడ్డి శ్రీనివాస్ రూ.2లక్షలు, విజేత సూపర్ మార్కెట్ యాజమాన్యం రూ.2లక్షలు, వ్యాపారవేత్త మండవల్లి నానాజీ రూ.ఒక లక్ష విరాళాన్ని ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్‌కు అందజేశారు. టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గొర్రెల శ్రీధర్, టీడీపీ పట్టణ అధ్యక్షుడు పట్నాల రాంపండు, జనసేన నాయకులు పాలూరి వెంకటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

మారంపల్లికి శాశ్వత రోడ్డు ఏర్పాటు చేస్తాం..

దశాబ్దాల కాలంగా గ్రామంలోకి వెళ్లేందుకు రోడ్డులేని మారంపల్లికి శాశ్వతంగా రోడ్డు ఏర్పాటు చేస్తానని ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ హామీ ఇచ్చారు. బుధవారం గ్రామంలో జరిగిన ప్రజాసమస్యల పరిష్కార వేదికలో ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. కార్యక్రమానికి జనసేన మండలాధ్యక్షుడు అడపా ప్రసాద్ అధ్యక్షత వహించగా ఉపసర్పంచ్ సరిపల్లె చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.



కాలువ పనులను పరిశీలిస్తున్న తోట ఫణిబాబు, సాయిలచ్చిరాజు తదితరులు

వేగవంతంగా కాలువలు, డ్రెయిన్ల ప్రక్షాళన పనులు

ఉండి, జూలై 23(ఆంధ్రజ్యోతి): ఉండి నియోజకవర్గంలో కాలువలు, డ్రెయిన్ల ప్రక్షాళన పనులు వేగవంతంగా జరుగుతున్నాయని ఉండి డీసీ కమిటీ చైర్మన్, వైస్ చైర్మన్ తోట ఫణిబాబు, మంతెన సాయిలచ్చిరాజు అన్నారు. బుధవారం సీసలి, మేడవరం, అర్తమూరు, చెరుకువాడ వంటి గ్రామాల్లో రైతులను దృష్టిలో పెట్టుకుని కాలువలు, డ్రెయిన్ల ప్రక్షాళన పనులను మరోసారి చేపట్టారు. సార్వా పంటకు రైతులకు ఇబ్బందులు లేకుండా చేయాలనేది లక్ష్యమన్నారు. కాలువలు, డ్రెయిన్ల వెంబడి ఆక్రమించిన వాటిని తొలగించి అభివృద్ధికి బాటలు వేస్తున్నట్లు తెలిపారు. డ్రెయినేజీ ఏఈ జయప్రకాశ్, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు కోరా రామ్మూర్తినాయుడు, కరిమెరక నాగరాజు, యడవల్లి వెంకటేశ్వరరావు, గురుగుబిల్లి సత్యనారాయణ, కాగిత బుజ్జి, మజ్జి కృష్ణప్రసాద్ పాల్గొన్నారు.



పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తున్న జనసేన, కూటమి నాయకులు

జనసేన స్తూపాన్ని ఢీకొట్టిన వారిపై చర్యలు తీసుకోవాలి

ఆచంట, జూలై 23 (ఆంధ్రజ్యోతి):జనసేన పార్టీ స్తూపాన్ని బైక్‌తో ఢీకొట్టిన వారిపై చర్యలు తీసుకోవాలని పోలీసుస్టేషన్‌లో కూటమి నేతలు బుధవారం వినతిపత్రం అందించారు. పెనుమంచిలిలో మూడు రోజుల కిందట జరిగిన అంబేడ్కర్ ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. కొంతమంది బైక్ ర్యాలీతో గ్రామంలో సైరెన్‌లు విప్పి పెద్దపెద్ద శబ్దాలతో ప్రజలను భయభ్రాంతులకు గురిచేశారని, అనంతరం గ్రామంలో జైన్ దేవాలయం చుట్టూ ఉన్న ప్రహరీని బైక్‌లతో ఢీకొట్టి పారేశారని, పక్కనే వున్న జనసేన పార్టీ స్తూపాన్ని ఉద్దేశపూర్వకంగానే బైక్‌తో ఢీకొట్టి అల్లరి సృష్టించారన్నారు. ఈ ఘటనకు పాల్పడిన వారిని గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని బుధవారం జనసేన పార్టీ మండల అధ్యక్షుడు బాలాజీ, గ్రామానికి చెందిన కూటమి నేతలు ఫిర్యాదు చేశారు.

'ప్లాస్టిక్ వినియోగం పర్యావరణానికి ముప్పు'

భీమవరంటౌన్, జూలై 23(ఆంధ్రజ్యోతి): ప్లాస్టిక్ వినియోగం పర్యావరణానికి ముప్పు వాటి ల్లేలా చేస్తాయని, ప్లాస్టిక్ వాడకం నిషేధంపై నిర్లక్ష్య ధోరణి పనికిరాదని చినరంగనిపాలెం మునిసిపల్ హైస్కూల్ హెచ్‌ఎం కోడె వెంకట్రావు అన్నారు. ప్లాస్టిక్ నిషేధ కమిటీ ఆధ్వర్యంలో బుధవారం జిల్లా కలెక్టర్ నాగరాణి పిలుపుమేరకు ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్లాస్టిక్‌ను నిషేధించి ఆరోగ్యాలను కాపాడుకోవాల్సిన బాధ్యత ఉందన్నారు. నిషేధ కమిటీ సభ్యులు చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధించి పర్యావరణాన్ని కాపాడా లన్నారు. పీఈటీ శ్రీనివాస్, ఉపాధ్యాయులు పి.రాజబాబు, విద్యార్థులు పాల్గొన్నారు.

రైతులు పంటల బీమా చేయించుకోవాలి

గణపవరం, జూలై 23(ఆంధ్రజ్యోతి):ఖరీఫ్ సీజన్‌లో రైతులు వరి సాగులో ఎరువుల వినియోగం తగ్గించుకోవాలని జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయాధికారి గీతాదేవి సూచించారు. బుధవారం కొత్తపల్లి గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఏవో ఆర్‌ఎస్.ప్రసాద్‌తో కలిసి రైతులకు సాగుపై సూచనలు చేశారు. ఏవో ప్రసాద్ మాట్లాడుతూ కౌలు రైతులందరూ తక్షణం కౌలుకార్డులు తీసుకోవాలన్నారు. ఎకరానికి రూ.210 చెల్లించి ప్రధాన మంత్రి పసల్‌బీమా పథకంలో నమోదు చేసుకోవాలని తెలిపారు. ఏఎంసీ వైస్ చైర్మన్ కూనసాని నాగేశ్వరరావు, రైతు నాయకుడు మద్దాల మధుసూదనరావు, రైతులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై దృష్టి సారించాలి

పెంటపాడు, జూలై 24(ఆంధ్రజ్యోతి):రైతులు ఎరువులు, పురుగు మందులను అధికంగా వినియోగించవద్దని ప్రకృతి వ్యవసాయంపై దృష్టి సారించాలని ఏవో చీర్ల రవికుమార్ అన్నారు. బుధవారం మండలంలోని కోరుమిల్లి, మీనవల్లూరు గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వరినాట్లలో రైతులు పాటించాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ గారపాటి భాస్కరరావు, పిచ్చికల వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

యువకుడిపై దాడి.. కేసు నమోదు

భీమవరం క్రైం, జూలై 23 (ఆంధ్రజ్యోతి): మావుళ్లమ్మ జాతరలో తలెత్తిన వివాదం ఒక యువకుడిపై దాడి వరకు దారితీసింది. టూటౌన్ హెచ్‌సీ కిశోర్‌బాబు తెలిపిన వివరాలివి.. దుర్గాపురం 39వ వార్డులో ఈ నెల 20న మావుళ్లమ్మ జాతరలో దీవెన కుమార్ అనే యువకుడు పొల్లు వెంకట గణేష్ అనే యువకుడిని కొట్టాడు. ఇద్దరి మధ్య వాగ్వాదం జరిగింది. అదేరోజు రాత్రి దీవెనకుమార్ మరో ఎనిమిది మందితో గణేష్ ఇంటికి వెళ్లి కొబ్బరిమట్టతో గణేష్‌పై దాడి చేశాడు. దాడిలో అతడికి తీవ్ర గాయాలయ్యాయి. ప్రస్తుతం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెచ్‌సీ తెలిపారు.



కాళీపట్నంలో కరపత్రాలు అందిస్తున్న టీడీపీ నరసాపురం ఇన్‌చార్జి రామరాజు, పార్టీ శ్రేణులు



ఆకివీడు సంత మార్కెట్‌లో మహిళకు కరపత్రం అందజేస్తున్న టీడీపీ మండలాధ్యక్షుడు రామవరప్రసాద్



తణుకు పట్టణంలో పర్యటించి కరపత్రాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ఆరిమిల్లి

కూటమి పాలనలో ప్రజలకు సంతృప్తి

» టీడీపీ నరసాపురం ఇన్‌చార్జి పొత్తూరి రామరాజు » 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమాలు

మొగల్తూరు, జూలై 23(ఆంధ్రజ్యోతి):సీఎం చంద్రబాబు సారథ్యంలోని కూటమి పాలనలో ప్రజలకు సంతృప్తి ఉందని టీడీపీ నరసాపురం నియోజకవర్గ ఇన్‌చార్జి పొత్తూరి రామరాజు తెలిపారు. బుధవారం కాళీపట్నంలో నిర్వహించిన 'సుపరిపాలనలో తొలిఅడుగు'లో భాగంగా ఇంటింటికి తిరుగుతూ ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలు వివరించారు. రాష్ట్ర మత్స్యకార సహకార సంఘాల సమాఖ్య చైర్మన్ కొల్లు పెద్దిరాజు, టీడీపీ మండల అధ్యక్షుడు గుబ్బల నాగరాజు, జోగి పండు, జక్కంశెట్టి బాలాజీ, శ్యామ్‌కుమార్, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

● ఆకివీడు : వైసీపీ పాలనలో చిన్నాభిన్నమైన రాష్ట్రాన్ని సీఎం చంద్రబాబునాయుడు గాడిలో పెట్టడానికి అహర్నిశలు కష్టపడుతున్నారని టీడీపీ మండలాధ్యక్షుడు మోటుపల్లి రామవరప్రసాద్ అన్నారు. సుపరిపాలన తొలి అడుగులో భాగంగా బుధవారం స్థానిక సంతమార్కెట్‌లో ఇంటింటికి తిరిగి కరపత్రాలు అందచేసి మాట్లాడారు. కిమిడి నాగరాజు, ఇల్లాపు బాలరాజు, శివ ఉన్నారు.

● ఉండి : కూటమి ప్రభుత్వ పాలనలో అభివృద్ధి పనులు ముందుకు సాగుతున్నాయని దీనికి ఉండి నియోజకవర్గమే నిదర్శనమని టీడీపీ మండల అధ్యక్షుడు కరిమెరక నాగరాజు అన్నారు. బుధవారం యండగండిలో 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమంలో భాగంగా ఇంటింటికి తెలుగు దేశం కార్యక్రమం నిర్వహిం చారు. ఆయన మాట్లాడుతూ నియోజక వర్గంలో కాలువ, డ్రెయిన్లు, ఇతర అభివృద్ధి పనులు పూర్తి చేశామన్నారు. టీడీపీ నాయకులు మాదాసి అజయ్, పి.పాపారావు, మాంద్రు ఆనంద కుమార్, టీడీపీ నాయకులు కళ్లేపల్లి సతీశ్ రాజు, వర్రే సముద్రమూర్తి తదితరులు పాల్గొన్నారు.

● గణపవరం:గణపవరంలో ఈనెల 26న నిర్వహించే సుపరి పాలనలో-తొలిఅడుగు కార్యక్రమంలో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజారపు అచ్చెన్నాయుడు పాల్గొంటారని టీడీపీ మండల అధ్యక్షుడు ఇందుకూరి రామకృష్ణంరాజు, గణపవరం పట్టణ టీడీపీ అధ్యక్షుడు కూసంపూడి సురేంద్రకుమార్‌రాజు తెలిపారు. ఆయనతో పాటు ఆప్కాబ్ చైర్మన్ గన్ని వీరాంజనేయులు పాల్గొంటారన్నారు.

పారిశుధ్యం మెరుగునకు కృషి

» ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ

తణుకు, జూలై 23(ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వంలో పారిశుధ్యం పడకేసిందని ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ అన్నారు. బుధవారం పట్టణంలో 7,8వ వార్డులలో 'సుపరిపాలనలో తొలి అడుగు'లో ఆయన మాట్లాడారు. వైసీపీ ప్రభుత్వంలో కనీసం దోమలు మందు పిచికారీ చేయలేని స్థితిలో అప్పటి పాలకులు ఉన్నారని విమర్శించారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పారిశుధ్య మెరుగునకు అనేక చర్యలు తీసుకున్నామన్నారు. వార్డుల్లో దోమలు మందు పిచికారీ చేయడంతోపాటు ప్రతి రోజు చెత్తను సేకరించే విధంగా చర్యలు తీసుకున్నామన్నారు. ఇంటింటికి వెళ్లి కరపత్రాలను పంపిణీ చేశారు. పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



బాధిత కుటుంబానికి చెక్కును అందిస్తున్న మంత్రి నిమ్మల

బాధిత కుటుంబానికి రూ.15.5 లక్షల సాయం

» చెక్కు అందజేసిన మంత్రి నిమ్మల రామానాయుడు

యలమంచిలి, జూలై 23(ఆంధ్రజ్యోతి):యలమంచిలిలో 2024 ఫిబ్రవరిలో కొబ్బరికాయల గొడౌన్ దగ్ధం కావడంతో తీవ్రంగా నష్టపోయిన బాధిత కుటుంబానికి రూ.15.50 లక్షల ఆర్థికసాయాన్ని మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు అందజేశారు. అగ్నిప్రమాదంలో తీవ్రంగా నష్టపోయిన యలమంచిలికి చెందిన కొబ్బరి వ్యాపారి కొడవటి వీరవెంకటసత్యనారాయణకు ప్రభుత్వపరంగా రూ.11 లక్షలు, టీడీపీ తరపున రూ.4.50 లక్షలు మొత్తం రూ.15.50 లక్షల చెక్కును బుధవారం అందజేశారు. ఆనాడు జరిగిన అగ్నిప్రమాదానికి నిర్దిష్టమైన కారణం తెలియనప్పటికీ ఆ సమయంలో అటువైపుగా పాదయాత్ర చేసిన రామానాయుడుకు విషయం తెలిసి మంటలు అదుపులోకి వచ్చేవరకూ.. అక్కడే ఉండి సహాయక చర్యల్లో పాల్గొన్నారు. మరుసటి రోజు బాధితకుటుంబాన్ని పరామర్శించి అధైర్యపడవద్దని.. మన ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఆర్థికసాయం అందేలా చూస్తానని హామీ ఇచ్చారు. ఇచ్చిన హామీని నిలబెట్టుకున్న మంత్రి రామానాయుడుకు బాధిత కుటుంబసభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. టీడీపీ మండల అధ్యక్షుడు మామిడిశెట్టి పెద్దిరాజు, జనసేన మండల అధ్యక్షుడు కొడవటి వరబాబు, బొప్పన హరికిషోర్, కాసా సత్య తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో సమస్యలు లేకుండా చూడాలి

మొగల్తూరు, జూలై 23(ఆంధ్రజ్యోతి):కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న అంగన్‌వాడీ కేంద్రాల్లో సమస్యలు లేకుండా చూడాలని సమగ్ర శిశు సంక్షేమ శాఖ ప్రాజెక్టు డైరెక్టర్ డి.శ్రీలక్ష్మి ఆదేశించారు. బుధవారం మొగల్తూరులోని సీడీపీవో కార్యాలయంలో ఏర్పాటు చేసిన అంగన్‌వాడీ కార్యకర్తల సమావేశంలో ఆమె మాట్లాడారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో తరచూ సమస్యలున్నాయంటూ ఫిర్యాదులు వస్తున్నాయని తక్షణమే పరిష్కరించాలన్నారు. సీడీపీవో బి.ఊర్మిళ, సూపర్‌వైజర్లు ఎన్.పద్మావతి, విజయకుమారి, శ్రీదేవి, దుర్గాభవాని, అరుణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

'బ్యాంకింగ్ సేవలపై అవగాహన ఉండాలి'

భీమవరంటౌన్, జూలై 23 (ఆంధ్రజ్యోతి): బ్యాంకుల ద్వారా అన్ని వర్గాల వారికి సంక్షేమ పథకాలు ఉన్నాయని, బ్యాంకింగ్ సేవలపై అవగాహన ఉండాలని భీమవరం కెనరా బ్యాంక్ మెయిన్ బ్రాంచి చీఫ్ మేనేజర్ కె.కాశీవిశ్వనాథ్ అన్నారు. భీమవరం కేజీఆర్‌ఎల్ కళాశాలలో శ్రీవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో బ్యాంకుల జాతీయకరణ దినోత్సవ ముగింపు కార్యక్రమాన్ని నిర్వహించారు. పలు పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. కళాశాల ప్రిన్సిపాల్ ఐ.రామచంద్రమూర్తి మాట్లాడుతూ జాతీయకరణ కారణంగానే బ్యాంకుల సేవలు పట్టణ ప్రాంతాల నుంచి గ్రామీణ ప్రాంతాలకు విస్తరించాయన్నారు. అనంతరం కార్యక్రమ నిర్వాహకుడు చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తమ నగదును పొదుపు చేసుకునేందుకు బ్యాంకు ఖాతా కలిగి ఉండాలన్నారు. ఎన్‌ఎస్‌ఎస్ ఆఫీసర్లు మురళీమోహన్, ఐజాక్, రాంబాబు, కిరణ్మయి తదితరులు పాల్గొన్నారు.



మొగల్తూరులో మాట్లాడుతున్న తహసీల్దార్ రాజ్‌కిషోర్



ఆచంట సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో కృష్ణమోహన్

'పీ4 సర్వే వేగవంతంగా పూర్తి చేయాలి'

మొగల్తూరు/ఆచంట/పాలకొలేరు, జూలై 23 (ఆంధ్రజ్యోతి):ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పీ4 సర్వే వేగవంతంగా సర్వే పూర్తిచేయాలని తహసీల్దార్ కె.రాజ్‌కిషోర్ ఆదేశించారు. ప్రభుత్వం ఇటీవల చేపట్టిన సచివాలయ ఉద్యోగుల బదిలీల్లో భాగంగా నూతనంగా చేపట్టిన గ్రామ సచివాలయ ఉద్యోగుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మండలంలోని 20 గ్రామ సచివాలయాల పరిధిలో బాధ్యతలు చేపట్టిన ఉద్యోగులంతా సక్రమంగా విధులు నిర్వర్తించాలన్నారు. ఎంపీడీవో త్రిశూలపాణి, డిప్యూటీ ఎంపీడీవో నవీన్ కిరణ్ తదితరులు పాల్గొన్నారు. ఆచంట మండలం ఆచంట ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో బి. కృష్ణమోహన్ ఆధ్వర్యంలో మండలంలోని సచివాలయ సిబ్బందికి పీ4 లక్ష్యం పై సమావేశం నిర్వహించారు. ఎంపీడీవో మాట్లాడుతూ పీ4 సర్వే ఎలా చేయాలి.. అనే వాటిపై వివరించారు. ఈ కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

● పాలకోడేరు మండలం గొరగనమూడిలో పీ4పై బుధవారం మండల పరిషత్ కార్యాలయ అధికారుల బృందం సర్వే నిర్వహించింది. గ్రామ సర్పంచ్ శివాజీరాజు అధ్యక్షతన గ్రామసభ జరిగింది. ఈ సందర్భంగా గ్రామంలోని 15 నిరుపేద కుటుంబాలను బంగారు కుటుంబాలుగా ఎంపిక చేశారు. సర్వేలో పాల్గొన్న డ్వామా పీడీ కేసీహెచ్.అప్పారావు మాట్లాడుతూ బంగారు కుటుంబాలను ఎంపిక చేశామని, కొంతమంది దత్తత తీసుకుని ఈ కుటుంబాలను అభివృద్ధి పథంలోకి తీసుకొచ్చేందుకు కృషి చేస్తారని అన్నారు. గ్రామసభలో మండల ప్రత్యేక అధికారి నాగలింగాచారి, ఎంపీడీవో రెడ్డియ్య, డ్రెయినేజీ ఏఈ దుర్గారావు, పంచాయతీ కార్యదర్శి సరళ, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరించాలి : ముదునూరి

యలమంచిలి, జూలై 23 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వ వైఫల్యాలను నాయకులు, కార్యకర్తలు ప్రజలకు వివరించాలని వైసీపీ జిల్లా అధ్యక్షుడు ముదునూరి ప్రసాదరాజు అన్నారు. స్థానిక కల్యాణమండపంలో వైసీపీ మండల అధ్యక్షుడు ఉచ్చుల స్టాలిన్ అధ్యక్షతన బుధవారం మండలస్థాయి 'బాబు ష్యూరిటీ.. మోసం గ్యారంటీ' సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఆయన మాట్లాడుతూ సంపద సృష్టిస్తా.. సంక్షేమాన్ని నాలుగురెట్లు అందిస్తానని చెప్పిన చంద్రబాబు సూపర్ సిక్స్ పథకాలను పూర్తిస్థాయిలో అమలు చేయకుండా ఏడాదికే చేతులెత్తేశారని విమర్శించారు. అనంతరం ఎంపీ మిథున్‌రెడ్డి అక్రమ అరెస్టును ఖండిస్తూ నాయకులు, కార్యకర్తలతో కలిసి ప్రధానకూడలిపై నిరసన తెలిపారు. ఎమ్మెల్సీ కవురు శ్రీనివాస్, పాలకొల్లు నియోజకవర్గ ఇన్‌చార్జి గుడాల గోపి, మురళీకృష్ణంరాజు, గుణ్ణం నాగబాబు, యడ్ల తాతాజీ, తదితరులు పాల్గొన్నారు.

ఓటమికి మందుబాబులు ఓ కారణం : కొట్టు

తాడేపల్లిగూడెం రూరల్:గత ఎన్నికల్లో వైసీపీ ఓటమికి మందుబాబులు ఓ కారణమని మాజీ మంత్రి కొట్టు సత్యనారాయణ పేర్కొన్నారు. తాడేపల్లిగూడెం గుణ్ణం ఫంక్షన్ హాలులో బాబు ష్యూరిటీ మోసం గ్యారంటీ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. వైసీపీ పాలనలో మద్యం విచ్చలవిడిగా విక్రయాలు జరగలేదని ధర పెరగడంతో ఇబ్బంది పడ్డ మందుబాబులు ప్రభుత్వంపై కోపం పెంచుకున్నారన్నారు. పట్టణ అధ్యక్షుడు కొలుకులూరి ధర్మరాజు, మండల అధ్యక్షుడు జడ్డు హరిబాబు, కైగాల శ్రీనివాస్, ఏఎంసీ మాజీ చైర్మన్ ముప్పిడి సంపత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ర్యాలీలో ఇరుక్కున్న కారుమూరి కాన్వాయ్

తణుకు రూరల్ : ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ నటించిన హరిహర వీరమల్లు సినిమా విడుదల సందర్భంగా తణుకులో ఆయన అభిమానులు నిర్వహించిన ర్యాలీ ఉద్రిక్తతకు దారి తీసింది. బుధవారం సాయంత్రం తణుకు పట్టణంలోని వేల్పూరు రోడ్డులో పవన్ అభిమానులు విజయోత్సవ ర్యాలీ నిర్వహిస్తుండగా అటుగా వెళ్తున్న మాజీ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు కాన్వాయ్ ర్యాలీలో ఇరుక్కిపోయింది. సత్వరమే పోలీసులు చేరుకుని కాన్వాయ్‌ను ట్రాఫిక్ నుంచి ముందుకు పంపించారు. వేల్పూరు రోడ్డులో భారీ ట్రాఫిక్ ఏర్పడింది.







దొంగరావిపాలెంలో శాకంబరిగా కొండాలమ్మ.. కొడమంచిలిలో గ్రామ దేవతలకు సారె తెస్తున్న భక్తులు.. నరసాపురంలో శాకంబరి అలంకరణలో పుష్ప మల్లమ్మకు పూజలు

అమ్మవార్లకు ఆషాఢ సారె

పెనుగొండ/ఆచంట, జూలై 23(ఆంధ్రజ్యోతి): పెనుగొండ మండలం సిద్ధాంతం గ్రామదేవత మావుళ్ళమ్మ అమ్మవారికి ఆషాఢ మాసాన్ని పురస్కరించుకుని సిద్ధాంతం చౌదరీస్ రామాలయం వద్ద నుంచి బుధవారం పలు రకాల వంటకాలు, స్వీట్లతో తయారు చేసిన సారెను మహిళలు అమ్మవారికి సమర్పించారు. దొంగరావిపాలెం కూరగాయల మార్కెట్ వద్ద కొండాలమ్మ అమ్మవారిని శాకంబరీగా అలంకరణ చేశారు. ఆచంట మండలం కొడమంచిలి గ్రామదేవతలు పెద్దింట్లమ్మ, వనుమలమ్మ, అంకాలమ్మ, ముసలమ్మ, వాసవి మాత, అమ్మవార్లకు గ్రామానికి చెందిన భక్తులు పలు రకాల స్వీట్లు, గాజులు, చీరలు వంటి వాటితో సారె సమర్పించారు.

● నరసాపురం రూరల్/మొగల్తూరు : నరసాపురం మండలం వైఎస్‌పాలెం గ్రామంలో మల్లమ్మ అమ్మవారిని పలు రకాల కూరగాయలతో శాకంబరీదేవిగా అలంకరించారు. మహిళలు సారె సమర్పించారు. వైస్ బాబులు, నాగులు, వెంకన, లక్ష్మణ్ పాల్గొన్నారు. పసలదీవి గ్రామంలో ఆషాడ సారెను గ్రామంలోని కనకదుర్గ అమ్మవారికి సమర్పించారు. చిట్టవరం గ్రామంలో మారెమ్మ, పాలమ్మ, చింతాలమ్మ అమ్మవార్లకు సారెను సమర్పించారు. మొగల్తూరు మండలం మొగల్తూరులోని పురాతన పార్వతీ విశ్వేశ్వరస్వామి ఆలయంలో అమ్మవారిని ఆర్యవైశ్య మహిళలు, భక్తులు శాకంబరీ దేవిగా అలంకరించారు.

● పెంటపాడు : పడమరవిప్పర్రు మహంకాళమ్మ, మహాలక్ష్మమ్మ అమ్మవార్లకు గ్రామస్థులు బుధవారం ఆషాఢ సారె సమర్పించారు. ఈసందర్భంగా అమ్మవార్లను శాకంబరీగా అలంకరించారు. ఈవో బీవీ.చంద్రశేఖర్, అర్చకుడు కొడవటిగంటి నర్సింహాచార్యులు, పసల అచ్యుతం, తదితరులు పాల్గొన్నారు.

'సమన్వయంతో పనిచేయాలి'

తణుకు రూరల్, జూలై23(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో సమస్య పరిష్కారానికి ప్రజా ప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పని చేయాలని ఎంపీపీ రుద్ర ధనరాజు తెలిపారు. బుధవారం తణుకు మండల పరిషత్ కార్యాలయంలో మండల పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. జడ్పీటీసీ సభ్యురాలు ముళ్లపూడి అన్నపూర్ణదేవి, ఎంపీడీవో లోహిత్ జయసాగర్, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, అధికారులు పాల్గొన్నారు.

వ్యాయామ అధ్యాపకుడి పోస్టుకు దరఖాస్తులు

తణుకు, జూలై23(ఆంధ్రజ్యోతి):చిట్టూరి ఇంద్రయ్య స్మారక ప్రభుత్వ కళాశాలలోని డిగ్రీ కోర్సులలో వ్యాయామ అధ్యాపకుడిగా కాంట్రాక్టు పద్ధతిలో పనిచేయుటకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ప్రిన్సిపాల్ సీహెచ్.ఏడుకొండలు బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. సంబంధిత సబ్జెక్టులలో కనీసం యాభై శాతం మార్కులు సాధించి, పీహెచ్‌డీ కలిగిన వారికి ప్రాధాన్యం ఇస్తామన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈనెల 28 సాయంత్రంలోపు కళాశాల కార్యాలయంలో సమర్పించాలన్నారు. వివరాలకు కాలేజి కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

నేడు గోదావరికి హారతి

నరసాపురంటౌన్,జూలై23(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని వలంధర్‌రేవులో విశ్వ హిందూ పరిషత్, భజరంగదళ్ ఆధ్వర్యంలో గురువారం వశిష్ఠా గోదావరికి అఖండ హారతి ఇస్తామని కటకంశెట్టి నాగేంద్ర తెలిపారు. కార్యక్రమానికి పీఠాధిపతులు, స్వామీజీలు, మహామునీశ్వరులు విచ్చేస్తారన్నారు.

కలవపూడిలో ఎక్సైజ్ దాడులు

కాళ్ల, జూలై23(ఆంధ్రజ్యోతి):ప్రభుత్వ అనుమతులు లేకుండా అనధికారంగా మద్యం అమ్మిన వారిపై చర్యలు తీసుకుంటామని ఆకివీడు ఎక్సైజ్ సీఐ ఎం.శ్రీనివాసరావు తెలిపారు. కాళ్ల మండలం కలవపూడి శివారు మోడి గ్రామంలో బుధవారం దాడులు నిర్వహించారు. అనధికారంగా మద్యం అమ్ముతున్న గుడాల కాంతమ్మను అదుపులోకి తీసుకుని ఆరు క్వార్టర్ బాటిల్స్ స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామని ఎక్సైజ్ ఎస్ఐ వి.కరుణప్రియ తెలిపారు.

కోడి రామకృష్ణ జయంతి

పాలకొల్లు టౌన్, జూలై 23(ఆంధ్రజ్యోతి) ప్రముఖ సినీ దర్శకుడు దివంగత కోడి రామకృష్ణ 76వ జయంతిని పాలకొల్లు కళాపరిషత్ ఆధ్వర్యంలో స్థానిక మారుతి సినిమా హాలులో ఘనంగా నిర్వహించారు. రామకృష్ణ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కళాపరిషత్ అధ్యక్షుడు కేవీ కృష్ణవర్మ మాట్లాడుతూ పాలకొల్లు కీర్తి ప్రతిష్ఠలను ప్రపంచానికి చాటిచెప్పిన మహనీయుడు కోడి రామకృష్ణ అని కొనియాడారు. మేడికొండ శ్రీనివాసరావు, వంగా నరసింహారావు, జక్కంపూడి కుమార్, కొల్లికొండ ప్రసాదు, మానాపురం సత్యనారాయణ పాల్గొన్నారు.

స్కూళ్లలో సమస్యలు తెలపండి

తాడేపల్లిగూడెం టౌన్, జూలై 23 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మునిసిపల్ పాఠశాలల్లో ఏమైనా సమస్యలు ఉంటే ఎస్టీయూ దృష్టికి తీసుకురావాలని సంఘ జిల్లా కార్యదర్శి బి.ఉదయకుమార్ కోరారు. స్థానిక ఈవీఎం స్కూల్‌లో ఎస్టీయూ పట్టణ నూతన కమిటీ ఎన్నికైంది. పట్టణ అధ్యక్షుడిగా కొడమంచిలి శ్రీను, ఉపాధ్యక్షుడిగా పి.ఆంజనే యులు, ప్రధాన కార్యదర్శిగా కె.గంగరాజు, సహాయ కార్యదర్శిగా వెంకటేశ్వర రావు, కోశా ధికా రిగా సునీత, మహిళా కార్య దర్శులుగా రేణుకాదేవి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మున్సిపల్ పాఠశాలల్లో సమస్యలు పరిష్కా రానికి కమిటీ పనిచేస్తుం దన్నారు.